# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

ఆదివారం 04 ఆగష్టు 2024


## సబ్‌కలెక్టరేట్ అగ్ని ఘటనలో 8మందిపై కేసులు

### బెయిల్ కోసం కోర్టులో ముందస్తు ఫిటిషన్లు

**మదనపల్లె, ఆగస్టు 3 ప్రభాతవార్త :**

సబ్‌కలెక్టరేట్ అగి ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎనిమిది మందిపై కేసులు నమోదు చేసినట్లు కర్నూల్ డిఐజి కొయ ప్రవీణ్ ఇటీవల విలేకర్లకు వెల్లడించిన విషయం తెలిసిందే. అయితే ఈ కేసులో నింధితులుగా ఉంటున్న వారు, అనుమానితులుగా ఉన్నవారు ముందస్తు బెయిల్ కోసం కోర్టులో ఫిటిషన్ దాఖలు చేసినట్లు తెలిసింది. ఇప్పటికే సబ్‌కలెక్టరేట్‌లో దస్త్రాల దహనం కేసుకు సంబంధించి ఇద్దరు ఆర్డీఓలు ఎంఎస్.మురళి, హరిప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ గౌతం తేజ్‌లను ప్రభుత్వం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. వైకాపా నేతల ఇళ్ళల్లో పోలీసులు నిర్వహించిన సోదాల్లో కీలకమైన డాక్యుమెంట్లు, ఉండకూడని డాక్యుమెంట్లు వారి ఇళ్ళల్లో ఉండడం వల్ల వారిపై కూడా కేసులు నమోదు చేశారు. మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా, మున్సిపల్ వైస్‌ఛైర్మెన్ జింకా వెంకటాచలపతిలపై కూడా కేసులు నమోదు చేసినట్లు డిఐజి వెల్లడించారు. పరారీలో ఉన్న మాజీ మంత్రి ప్రధాన అనుచరుడు మాధవరెడ్డితో పాటు మిగిలిన వైకాపా నేతలపై కూడా కేసులు నమోదు చేసినట్లు తెలిసింది. దస్త్రాల దహనం కేసుకు సంబంధించి పలువురు వైకాపా నాయకుల్లో ఆందోళన నెలకొంది.

## శాశ్వత నీటి సమస్య పరిష్కారమే లక్ష్యం

### - రాష్ట్రష రవాణా యువజన క్రీడాశాఖామంత్రి మండిపల్లి

**రాయచోటి, ఆగస్టు 3, ప్రభాతవార్త:**



రాయచోటి నియోజకవర్గంలో శాశ్వత నీటి సమస్య పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్లడం జరుగుతుందని రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలు నీటి సమస్యతో నానా ఇబ్బందులు ఎదుర్కొనే వారిని ప్రభుత్వం ఏర్పడిన తరువాత నీటి సమస్య పూర్తిగా నివారించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు నీటి సమస్య ఉన్న గ్రామాల్లో దాదాపు 15 బోర్లు వేయడం జరిగింది. గాలివీడు మండలం, ఎగువగొట్టివీడు గ్రామంలోని నాగన్నగుట్ట పాలెంలో బోరు వేయడం జరిగింది. ఈ బోరు నుంచి గ్రామానికి నీటి సరఫరా చేసి సమస్య పరిష్కరించడం జరుగుతుంది. దీంతో గ్రామ ప్రజలు నీటి సమస్య పరిష్కారం కాబోతుండడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రజల కష్టాలు వింటూ వినతులు స్వీకరిస్తూ

### - ప్రజా దర్బార్‌లో బాధితులకు మంత్రి మండిపల్లి భరోసా

**రాయచోటి, ఆగస్టు 3, ప్రభాతవార్త:**

రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శనివారం తమ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌కు తమ సమస్యలు విన్నవించేందుకు వందల మంది ప్రజలు తరలి వచ్చారు. అన్నమయ్య జిల్లా నలు మూలల నుంచి ప్రజలు ఉదయం 9 గంటలకే ఇక్కడికి చేరుకొని వినతి పత్రాలతో బారులు తీరారు. ఉదయం 9 నుంచి సాయంత్రం వరకు ప్రజల కష్టాలు వింటూ మంత్రి మండిపల్లి వినతులు స్వీకరించారు. విజయవాడ నుంచి జిల్లాకు చేరుకున్న మంత్రి రోజు రోజుకు అధిక సంఖ్యలో బాధితులు తమ సమస్యలు పరిష్కరించాలని అర్జీలు సమర్పిస్తున్నారు.



## విద్యార్థుల హక్కులను గౌరవిద్దాం

### - జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్




**రాయచోటి, ఆగస్టు 3, ప్రభాతవార్త:**

విద్యార్థుల హక్కులను గౌరవిస్తూ వారికి భద్రమైన సురక్షితమైన బాల్యాన్ని అందించాల్సిన బాధ్యత సమాజం మీద ముఖ్యంగా పాఠశాల యాజమాన్యాల మీద ఉంటుందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఉద్బోధించారు. స్థానిక కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో శనివారం నేషనల్ కమీషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వర్కుషాపు నిర్వహించబడింది. జిల్లాలోని అన్ని మండలాల నుంచి ఎంపిక చేయబడిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులు మరియు ఉపాధ్యాయులకు నిర్వహించిన ఈవర్కుషాప్‌నకు జేసీ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో బాలల భద్రతకు సంబంధించిన పలు అంశాల గురించి వివరించారు. ఎన్‌సీపీసీఆర్ ప్రతినిధి డా.చిట్టిబాబు మాట్లాడుతూ విద్యార్థులకు సైబర్ సేఫ్టీ మీద అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరూ ఉపాధ్యాయుల మీద ఉందన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ పిల్లలను మానసికంగా లేదా శారీరకంగా హింసించరాదన్నారు. బాలల హక్కులను గౌరవిస్తూ ప్రతి పాఠశాలలో బాలలకు అవసరమైన అన్ని సురక్షిత మార్గాలు అవలంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి కరుణాకర్, డైట్ లెక్చరర్లు అజయ్‌కుమార్, శ్రీదేవి, అసదుల్లా, సెక్టోరల్ అధికారులు రాధ, సమీవుల్లా, జనార్ధన్, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మున్సిపల్ పాలకవర్గ సమావేశం రసాభాస...

### విద్యుత్ స్మశాన వాటికలో యంత్రాల దొంగలు ఎత్తుకెళ్లారు..

### పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించలేని దుస్థితిలో మున్సిపాలిటీ ఉందా?

### నిలదీసి.. నిగ్గు తేల్చాలని కౌన్సిలర్లు డిమాండ్

**రాజంపేట అర్బన్, ఆగస్టు 03, ప్రభాతవార్త:**

పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించలేని దుస్థితిలో మున్సిపాలిటి ఉందా? పనులు చేయరు. పట్టించుకోరు. విద్యుత్ స్మశాణ వాటికలో యంత్రాలన్నీ దొంగలు ఎత్తుకుపోతే మీరేం చేస్తున్నారు. ఇలా అయితే ప్రజలకు ఏమి జవాబు చెప్పాలని మున్సిపల్ కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. శనివారం మున్సిపల్ పాలకవర్గ సమావేశం చైర్మెన్ పోలా శ్రీనివాసులు రెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో అధికార పార్టీ కౌన్సిలర్లు డొంకా సూరి, కూండ్ల వెంకటరమణారెడ్డి, పసుపులేటి సుధాకర్, నవీన్‌కుమార్, ప్రతాప్, రాము యాదవ్ మాట్లాడుతూ అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, కార్యాలయంలో జవాబుదారితనం లోపించిందని, చివరకు మున్సిపల్ కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు గురించి చెల్లించలేని దుస్థితిలో మున్సిపాలిటీ ఉందా అని ప్రశ్నించారు. కోటి రూపాయల వ్యయంతో నిర్మించిన విద్యుత్ స్మశాన వాటిక పరిస్థితి ఏమిటని ఇది అలాగే వదిలేస్తారని ప్రశ్నించారు. స్మశాన వాటికలో ఉన్న యంత్రాల పరిస్థితి ఏమిటి అని అడిగారు. దొంగలు ఎత్తుకెళ్లారని గుట్టుచప్పుడు కాకుండా అధికారులు సమాధానం ఇచ్చారు. మీరేం చేస్తున్నారని ప్రశ్నించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చావు కబురు చల్లగా చెప్పారు. కార్మికులకు జీతాలు చెల్లిస్తామని మున్సిపల్ కమీషనర్ రాంబాబు తెలిపారు. ఎమ్మెల్యే జోక్యం చేసుకొని కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. మంచి పని చేస్తేనే ప్రజల్లో మంచి పేరు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే దృష్టికి గోశాల సమస్యలు తీసుకువెల్లారు. గోవులకు యజమానులు వదిలివేయడం వల్ల పట్టణంలో ప్రజలు ఇబ్బందులు గురవుతున్నారని కౌన్సిలర్లు చెప్పారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే అమర్‌నాథ్ రెడ్డి ఎకరా భూమి గోవుల కోసం ఇచ్చేందుకు హామి ఇచ్చారు. సమావేశంలో 33 అభివృద్ధి పనులకు పాలకవర్గం ఆమోదం తెలిపింది. ఏఈలు శిల్ప, మల్లేశు. మేనేజర్ శేషఫణి, మున్సిపల్ వైస్‌చైర్మెన్ మర్రి రవి, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.



## క్లీన్ విలేజ్‌ను తనిఖీ చేసిన జిల్లా పంచాయతీ అధికారి



**చిన్నమండెం, ఆగస్టు 3, ప్రభాతవార్త :**

మండలంలోని విలేజ్ క్లీన్‌గా సెలెక్ట్ అయిన మల్లూరు విలేజ్‌ను శనివారం జిల్లా పంచాయతీ అధికారి మిద్దింటి ధనలక్ష్మి సందర్శించారు. గ్రామాన్ని అన్ని విధాలా పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నజీర్, పంచాయతీ కార్యదర్శి శ్వేత, వెల్ఫేర్ అసిస్టెంట్ రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గురు వైసీపీ కౌన్సిలర్లు టిడిపిలో చేరిక

### సీఎం చంద్రబాబు నాయకత్వంపై నమ్మకంతోనే చేరికలన్న ఎమ్మెల్యే వరద





**ప్రొద్దుటూరు, ఆగస్టు 03, ప్రభాతవార్త:**

ప్రొద్దుటూరు మున్సిపల్ పరిధిలో ఇప్పటికే నలుగురు వైసిపి కౌన్సిలర్లు టిడిపిలో చేరగా మరో ముగ్గురు శనివారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరారు. ఈ సంధర్భంగా 16వ వార్డు కౌన్సిలర్ మోపూరి రేవతి, ఆమె భర్త శ్రీనివాసుల రెడ్డి, 21వ వార్డు కౌన్సిలర్ కొవ్వూరు స్వాతి ఆమె భర్త కొవ్వూరు కృష్ణ చైతన్య రెడ్డి, 36వ వార్డు కౌన్సిలర్ అలవలపాటి అరుణాదేవిలకు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి టిడిపి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో రాష్ట్ర ప్రజలు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని పట్టం కట్టారన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వంపై నమ్మకంతోనే మున్సిపల్ కౌన్సిలర్లు వైసిపి నుండి టిడిపిలో చేరడం సంతోషకరం అన్నారు. ఈ సంధర్భంగా వారిని సాదారంగా స్వాగతిస్తున్నట్లు తెలిపారు. కొవ్వూరు రామ సుబ్బారెడ్డి కుటుంబం రాజకీయంగా తమకు ఎంతో అండగా ఉందని ఆయన మనుమడు కొవ్వూరు కృష్ణ చైతన్య రెడ్డి తెలుగుదేశం పార్టీలో చేరడం అభినందనీయం అన్నారు. బసిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలు జరిగిన మూడున్నర సంవత్సరాల క్రితం నుండి కౌన్సిలర్లకు ఎలాంటి స్వేచ్ఛ గాని ఇవ్వక కేవలం మాజీ ఎమ్మెల్యే ఆయన బావమరిది కనుసన్నల్లో పాలన కొనసాగించారన్నారు. ఏ కౌన్సిలర్‌కు తమ వార్డులో అభివృద్ధి పనులు చేసుకునే స్వేచ్ఛ కూడ ఇవ్వలేదని తెలిపారు. అందుకే కౌన్సిలర్లు తెలుగుదేశం పార్టీలో చేరేందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో చంద్రబాబు నాయకత్వంలో ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధికి అందరం కలిసి కృషి చేస్తామని ఎమ్మెల్యే వరద తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, టిడిపి నాయకులు నంద్యాల రాఘవరెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వీఎస్ ముక్తియార్, ఈవి సుధాకర్ రెడ్డి, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు మరియు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యర్రగుంట్ల నాలుగు రోడ్ల విస్తరణకు ఏర్పాట్లు

### విస్తరణ పనులను పరిశీలించిన నేషనల్ హైవే డిఈ విజయభాస్కర్ రెడ్డి



**యర్రగుంట్ల, ఆగస్టు 03, ప్రభాతవార్త:**

యర్రగుంట్ల నగర పంచాయతీ పరిధిలోని నాలుగు రోడ్ల కూడలిలో జాతీయ రహదారి శాఖ ఆధ్వర్యంలో విస్తరణ పనులను చేపట్టడానికి నేషనల్ హైవే డిఈ విజయభాస్కర్ రెడ్డి పరిశీలించారు. శనివారం స్థానిక మున్సిపల్ కమీషనర్ రామకృష్ణయ్యతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్రగుంట్ల మీదుగా చాగలమర్రి నుండి రాయచోటి వరకు నేషనల్ హైవే మంజూరు అయిందన్నారు. అందులో భాగంగానే నాలుగు రోడ్ల కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలియజేశారు. నాలుగు రోడ్ల కూడలిలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి ఎదురుగా సిగ్నల్స్ ఏర్పాటుకు సంబంధించి విస్తరణ చేయాల్సి ఉందని అన్నారు. కడప రోడ్డు, వేంపల్లి రోడ్డు, ముద్దనూరు రోడ్డు, ప్రొద్దుటూరు రోడ్డులో నాలుగు దిక్కులు విశాలంగా ఉండే విధంగా పనులు చేపట్టనున్నట్లు తెలియజేశారు. ఇక్కడ రోడ్డుకు అడ్డంగా ఉన్న అక్రమదారులకు నోటీసులు మున్సిపల్ అధికారులు సిద్ధం చేస్తున్నట్లు వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ గంగిరెడ్డి పాల్గొన్నారు.

## ఉద్యోగం కోసం రూ.లక్ష డిమాండ్

### - నిద్రమాత్రలు మింగి హిందీ టీచర్ ఆత్మహత్యాయత్నం

**రాయచోటి, ఆగస్టు 3, ప్రభాతవార్త:**

పార్ట్‌టైం హిందీ టీచర్ ఉద్యోగాన్ని కాపాడుకోవడం కోసం ఎర్రగుంట్ల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్, రామాపురం గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ నా ఉద్యోగాన్ని కాపాడుకోవాలంటే లక్ష రూపాయలు డిమాండ్ చేశారు. అంటూ అదే పాఠశాలలో పనిచేసిన డి.సునీత ఆరోపించారు. మండల పరిధిలోని నారాయణరెడ్డిపల్లి గ్రామం ఎర్రగుంట్ల సమీపంలోని ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల పార్ట్ టైం హిందీ టీచర్ సునీత శనివారం నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. సునీత వివరాల మేరకు 2017 నుంచి ఎర్రగుంట్ల గురుకుల పాఠశాలలో పనిచేస్తున్నట్లు తెలిపారు. సునీత వివరాల మేరకు 2017 నుంచి ఎర్రగుంట్ల గురుకుల పాఠశాలలో పనిచేస్తున్నట్లు తెలిపారు. అక్కడ పనిచేసే ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ నాపై అసత్యమైన నిందారోపణలు చేసి 2023-24 సంవత్సరంలో రామాపురం గురుకుల పాఠశాలకు పంపారన్నారు. అప్పటి నుంచి నేను స్పందనలో ఫిర్యాదు చేశానని జేసీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తన ఉద్యోగం కోసం ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు ఆగస్టు 1వ తేదీ మంత్రికి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. నేను అక్కడ పోయిన తరువాత ఎర్రగుంట్లలోని పోస్టును అమ్ముకున్నట్లు తెలిపారు. నాకు తిరిగి ఎర్రగుంట్లలోనే పార్ట్ టైం టీచర్‌గా కొనసాగించాలని కలెక్టరును కలిసినట్లు తెలిపారు. జిల్లాలో ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడికి వెళ్లాలని కలెక్టరు చెప్పడంతో అక్కడే సూసైడ్ నోట్ రాసి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కలెక్టరేట్‌లో ఉన్న పోలీసులు సునీతను రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యం పొందుతున్న సునీత మాట్లాడుతూ ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్‌లు రూ.లక్ష డబ్బులు డిమాండ్ చేశారని తాను ఇవ్వకపోవడంతో నా పోస్టును వేరే వారికి అమ్ముకున్నారని ఆరోపించారు. కలెక్టర్ దగ్గరికి వెళ్లి నాకు న్యాయం జరగకపోవడంతో మనస్తాపంతో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. ఈ విషయంపై గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ అరుణను వివరణ కోరగా ఎలాంటి డబ్బులు డిమాండ్ చేయలేదని డబ్బులకు ఉద్యోగాన్ని ఎవరికీ ఇవ్వలేదన్నారు. గత ఏడాది సునీత రామాపురంలోని గురుకుల పాఠశాలలో పనిచేసినట్లు తెలిపారు.

## భరతనాట్యం కళాకారిని యామిని క్రిష్ణమూర్తి కన్నుమూత

**మదనపల్లె, ఆగస్టు 3 ప్రభాతవార్త :**



భరత నాట్యం కళాకారుని యామిని క్రిష్ణమూర్తి(84) అనారగ్య సమస్యతో శనివారం తుదిశ్వాస విడిచారు. డిల్లీలోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. యామిని క్రిష్ణమూర్తికి ఏపిలోని అన్నమయ్య జిల్లా మదనపల్లెలో 1940లో జన్మించారు. తండ్రి క్రిష్ణమూర్తి సంస్కృతపండితులు. చిన్నతనంలోనే తమిళనాడు రాష్టం చిదంబరంలో స్థిరపడ్డారు. 1957లో తొలి నృత్య ప్రదర్శన ఇచ్చింది. అప్పటి నుంచి వేలాదిగా ప్రదర్శనలు ఇచ్చి దేశ, విదేశాల్లో మంచి గుర్తింపు తెచ్చుకొంది. ఈమెకు భారత ప్రభుత్వం పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషన్ అవర్డులు అందజేసి ప్రముఖ మహిళగా గుర్తింపు ఇచ్చారు. ఈమె మృతితో మదనపల్లెలో విషాదచాయలు అలుముకొన్నాయి. ఈమె మృతికి సంతాపంగా రాష్టపతి ముర్ము, ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖులు, కళాకారులు నివాళులు తెలిపారు.

## అన్నమయ్య జిల్లాలో 12మంది తాసిల్దార్ల బదిలీ

**రాజంపేట అర్బన్, ఆగస్టు 03, ప్రభాతవార్త:**

అన్నమయ్య జిల్లాలో 12మంది తాసిల్దార్లను నియామకం చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. రాయచోటి తాసిల్దార్‌గా పుల్లారెడ్డి, రాజంపేటకు మహబూబ్ చాంద్, గాలివీడుకు భాగ్యలత, చిన్నమండెంకు సి.నర్సింహులు, వీరబల్లెకు శ్రావణి, సుండుపల్లెకు దైవాదీనం, నందలూరుకు అమర్నాథ్ లను నియమిస్తూ ఉత్తర్వులు వెలుబడ్డాయి. రాయచోటి కలెక్టరేట్ కార్యాలయ ఏవోగా జి.నాగభూషణం, రాయచోటి ఆర్డీఓ కార్యాలయ ఏఓగా తులసమ్మ, రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవోగా పిఆర్ శేశయ్య, కలెక్టరేట్‌లో ఏవోగా భూవిభాగానికి సంబంధించి ఉదయ్‌శంకర్ రాజు, భూసేకరణ విభాగం సూపరిండెంట్‌గా కలెక్టరేట్‌లో రాజంపేటలో గతంలో పనిచేసిన తాసిల్దార్ ఎంవి సుబ్రహ్మణ్యం రెడ్డిని నియమించారు.

### ఆర్థిక సమస్యలతో రైలు కింద పడి

## వ్యక్తి ఆత్మహత్య

**యర్రగుంట్ల, ఆగస్టు 03, ప్రభాతవార్త:**

యర్రగుంట్ల రైల్వేస్టేషన్ సమీపంలో ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన లింగాల వెంకటరామిరెడ్డి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిన ఘటన శనివారం నాడు చోటు చేసుకుంది. పట్టణంలోని నాగేంద్రనగర్‌కు చెందిన రిటైర్డ్ లెక్చరర్ వెంకట్రామిరెడ్డి ఆర్థిక సమస్యలతో ఆత్మహత్య కు పాల్పడినట్లు యర్రగుంట్ల రైల్వే హెడ్ కానిస్టేబుల్ రాజారాం రెడ్డి తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసినట్లు రైల్వే పోలీసులు పేర్కొన్నారు.



# మహిళా ఉద్యోగిని వేధించడం తగదు

కడప కార్పొరేషన్, ఆగస్టు 3, ప్రభాతవార్త:



తరాలు గడుస్తున్నా నేటికీ దళితుల పట్ల వివక్ష కొనసాగడం బాధాకరమని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ప్రభుకుమార్ అన్నారు. ఆ మేరకు కడపలోని చిన్నచౌకు ప్రాంతంలో గల డా.బీఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన సెక్యూరిటీ సూపర్ వైజర్‌గా విధులు నిర్వహించే ఎన్.అరుణకుమారి పట్ల వివక్ష చూపుతూ కులం పేరుతో దూషించడంతో ఆమె అసహనానికి గురై వాస్మాల్ తాగడం బాధాకరమన్నారు. దీంతో ఆమెను రిమ్స్‌లో చేర్పించడం జరిగిందన్నారు. శనివారం కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న అరుణకుమారిని వారు పరామర్శించారు. దళితురాలు అనే చిన్న చూపుతో ఆమెను ప్రస్తుతం చేస్తున్న సెక్యూరిటీ సూపర్‌వైజరు స్థాయి నుంచి శానిటేషన్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహించాలని పై అధికారిని ఒత్తిడి తేవడం సరైంది కాదన్నారు. ఈ విషయంపై జిల్లా అధికారులు స్పందించి అధికారినిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# రైతులకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వంపై పోరాటం ఆగదు

– జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి

కలికిరి, ఆగస్టు 3, ప్రభాతవార్త:



పీలేరు నియోజకవర్గంలోని బొప్పాయి పంట పండించిన రైతులకు అదే విధంగా కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని అన్నమయ్య జిల్లా ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి వంగిమల రంగారెడ్డి పేర్కొన్నారు. శనివారం పీలేరు నియోజకవర్గంలోని మండలాల్లో బొప్పాయి పంటలను రంగారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు నియోజకవర్గంలో అధిక సంఖ్యలో రైతులు బొప్పాయి పంట సాగు చేయడం జరిగింది. కానీ నర్సరీ యాజమాన్యం నాసిరకం నకిలీ విత్తనాల మొక్కలు అందించడంతో రైతులు, కౌలు రైతులు నష్టపోయారు. ఎకరాకు సుమారు రూ.2లక్షలు ఖర్చు చేసి పంట పండించి పంట దిగుబడి రాకపోవడంతో రైతులు నష్టపోయారు. దీంతో ఇటీవల బొప్పాయి రైతులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో నర్సరీ యాజమాన్యంపై కేసులు నమోదు చేసి ఎకరాకు రూ.15వేలు నర్సరీ యాజమాన్యం నష్టపరిహారం అందించి చేతులు దులుపుకోవడం జరిగింది. ఆగస్టు 9న ఈ సమస్యపై చలో కలెక్టరేట్ కార్యక్రమానికి పిలుపునివ్వడం జరిగింది. పీలేరు నియోజకవర్గంలోని బొప్పాయి రైతులకు ప్రభుత్వం న్యాయం చేసే వరకు తమ పోరాటం ఆగదని జిల్లా ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. ఈ సమావేశంలో బొప్పాయి రైతులు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

# కలికిరిలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం

కలికిరి, ఆగస్టు 3, ప్రభాతవార్త:



కలికిరి మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం వాల్మీకిపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి భారతి ఆద్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకిపురం ఐసీడీఎస్ సీడీపీవో మాట్లాడుతూ తల్లి పాలు ముద్దు.. డబ్బా పాలు వద్దు అని నినాదాలు చేశారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలని దాని వల్ల వ్యాధి నిరోదక శక్తి పెరుగుతుందని తల్లులకు సీడీపీవో సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లిపాల వారోత్సవాలను పంచాయతీలోని గర్భవతులు, బాలింతలు ఈ కార్యక్రమాలు సద్వినియోగం చేసుకోవాలని సీడీపీవో భారతి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ అరుంధతి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ రాష్ట్ర మాల మహానాడు కార్యదర్శిగా ఇల్లూరి సురేష్

కడప కార్పొరేషన్, ఆగస్టు 3, ప్రభాతవార్త:



ఏపీ రాష్ట్ర మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శిగా ఇల్లూరి సురేష్ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఏపీ రాష్ట్ర మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు విజయశేఖర్ నియామక పత్రాన్ని అందించారు. శనివారం కడప రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో నియామక పత్రాలు అందించారు. గత రెండు సంవత్సరాలుగా పనిచేస్తున్న సురేష్‌ను రాష్ట్ర కార్యదర్శిగా జేష్టాది భాస్కర్‌ను రాయలసీమ అధ్యక్షులుగా, పాలెం సంజీవయ్యను జిల్లా అధ్యక్షులుగా నియమించారు. రాష్ట్ర మాలమహానాడు అధ్యక్షుడు విజయ్ శేఖర్, రాష్ట్ర కార్యదర్శి ఇల్లూరి సురేష్‌లు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు బాధాకరమన్నారు. ఎస్సీ కేటగిరిలో 59 కులాలు ఉండగా కకేవలం ఒక్క కులానికే అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం సరికాదన్నారు. మాల కులస్థులకు నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మాదిగ సోదరులు ఎస్సీ వర్గీకరణ విషయం పోరాటం చేసి సమయాన్ని వృథా చేశారని తాముభావిస్తున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయం పూర్తిగా నిర్మూలించే వరకు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ మాల మహానాడు ప్రతినిధులు జాకట దినేష్, డేవిడ్, సత్యరాజ్, జాకట దీపక్, శిరీష, ఆకుమల్లు పురుషోత్తం, తేజ, ప్రజ్వాల్, జేష్టాది పవన్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గండికోటలో నేడు బీజేవైఎం పథాధికారుల సమావేశం

కడప కార్పొరేషన్, ఆగస్టు 3, ప్రభాతవార్త:



బీజేవైఎం ఆధ్వర్యంలో రాయలసీమ జోన్ పథాధికారుల సమావేశం ఆదివారం గండికోటలో జరుగనుందని బీజేవైఎం రాయలసీమ జోనల్ ఇన్‌ఛార్జి తోట సూర్యప్రకాష్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్ష/డు బొమ్మన విజయ్‌లు తెలిపారు. శనివారం కడప భాజపా కార్యాలయంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు విజయ్‌తో కలిసి తోట సూర్యప్రకాష్‌రెడ్డి విలేకరుల సమావేశంలో తెలిపారు. యువతకు ఉపాధి కల్పనపై చర్చిస్తామని రాయలసీమలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే యువకు ఉద్యోగాలు అందుతాయని ఆ మేరకు ప్రయత్నిస్తామని తెలిపారు. మోదీ సంక్షేమ ఫలాలు అందిసఉన్నారని కొనియాడారు. ఎస్సీ వర్గీకరణను నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా జనరల్ సెక్రటరీ సురేంద్ర, ట్రెజరర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఆ అపోహ వద్దు !

**అందానికి ప్రాధాన్యం** ఇచ్చేవారిలో అమ్మాయిలే ముందుంటారు కదా! దానికోసం చేయని డైటింగులు, శారీరక వ్యాయామాలుండవు. అంతేకాదు, వారు బరువు పెరగకుండా ఉండేందుకు ఆహారాన్ని చాలవరకు పరిమితం చేసుకుంటారు. ఎంత బరువు తగ్గినా ఇంకా పెరిగిపోతున్నామనే భయం వీరిని వెంటాడుతుందట. దీనివల్ల తరవాత వారికి తినాలని ఆసక్తి కొద్దీ తిన్నా పొట్ట కుంచించుకుపోయి, ఆహారం కాస్త ఎక్కువైనా వాంతులు అవుతుంటాయి. నెమ్మదిగా ఇదే వ్యాధిలా కూడా మారుతుంది. దీనినే

అనోరెక్సియా అంటారు. ఈ లక్షణం ఉన్నవారు ఎంత బరువు తగ్గినా ఇంకా పెరిగిపోతున్నామనే భయం వీరిని వెంటాడుతుందట. అయితే ఈ లక్షణాలు, టీనేజీ అమ్మాయి ల్లోనూ, ముప్ఫైల్లోపు స్త్రీలలోనూ ఎక్కువగా కనిపిస్తుంది. దీనివల్ల పోషకాహారలోపానికి గురవ్వడమే కాకుండా, మెదడు, గుండె, మూత్రపిండాలతో సహా శరీరంలో ప్రతి అవయవం దెబ్బతినే ప్రమాదం ఉందట. దీనిని అదుపు చేయాలంటే మాత్రం వైద్యుల్ని సంప్రదించి ఆహార నియమాల్లో మార్పులు తప్పనిసరి అంటున్నారు నిపుణులు. కాబట్టి అమ్మాయిలు ముందు మనం ఆరోగ్యంగా ఉంటేనే ఎన్ని జాగ్రత్తలు అయినా పాటించవచ్చు.



# తమలపాకు పండింది..



**అమ్మాయి అరచేయి..** ఎర్రగాపండి కనిపిస్తోంటే ఎంత అందమో కదా! వేడుకలప్పుడు చేతిపై ఆ అందం లేకపోతే బోసిపోయినట్లే అనిపిస్తుంది. కానీ అస్తమానం గోరింటాకేకావాలంటే చాలామందికి కష్టమే. అయితే తమలపాకు తెచ్చేసుకోండి. దానితోనూ అరచేత ఎర్రదనం పండించుకోవచ్చు.

ఎలాగంటే తాజా తమలపాకులు ఓ పది తీసుకుని, కాడలు తీసేయండి. వాటికి అరస్పూను చొప్పున పసుపు, సున్నం కలిపి, మెత్తగా మిక్సీ పట్టండి. నీళ్లు కలపొద్దు, నిల్వ ఉన్న ఆకుల్నీ వాడొద్దు. తరవాత రసాన్ని వడకట్టి, బాగా ఎర్రగా ఉన్న కుంకుమ కలుపుకోవాలి. ఆ మిశ్రమంతో చేతిపై నచ్చిన డిజైను వేసు కోండి. ఆరిన తరువాత కడిగేసి చూసు కోండి.



అచ్చమైన గోరిం టాకు లాగే పండుతుంది. మొత్తం ప్రక్రియకు ఎక్కువ సమయం కూడా పట్టదు. కావాలంటే ప్రయత్నించి చూడండి.

# బర్నవుట్ అవుతున్నారా ?

ఆఫీసు వర్క్ చేస్తున్నప్పుడు ఆకస్మాత్తుగా మధ్యలో పని ఆపేయాలనిపిస్తుంది. రొటీన్‌గా అనిపించి తీవ్ర ఒత్తిడికి లోనవుతుంది. దీన్నే బర్నవుట్ అంటున్నారు నిపుణులు. ఇందులోంచి బయటపడే మార్గాలను సూచిస్తున్నారు. ప్రస్తుతం పనిలో వేగాన్ని పెంచుకోవడం అనివార్యమైంది.



పోటీ కూడా పెరిగింది. అయితే ఈ వేగానికి అతిచేరువలోనే బర్నవుట్ పొంచి ఉంటుంది. ఈ రెండింటి మధ్య సన్నని గీత ఉంటుంది. మొత్తం పనిని వేగంగా పూర్తిచేయాలని ప్రయత్నిస్తూ, తెలియకుండానే మెదడుకు ఒత్తిడి కలిగిస్తాం. పనిలో ఇలా కాస్తంత కూడా విరామం లేకుండా నిరంతరం వేగంగా కొనసాగించుకుంటూ పోతే క్రమేపీ అది అలసట. ఒత్తిడికి దారి తీస్తుంది. దీంతో పనిపై నిర్లిప్తత మొదలవుతుంది. అశ్రద్ధచేస్తే ఈ స్థితి దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదం ఉంది.

**విభజించాలి:** విధుల్లో భాగంగా ఉత్సాదకత పెరిగేలా జాగ్రత్త పడుతూనే ప్రాముఖ్యతను బట్టి పనులను విభజించగలిగే నైపుణ్యాలను పెంచుకోవాలి. ఇతరులు చేయగలిగేవాటిని వారికే అప్పగించాలి. వాటిని పర్యవేక్షిస్తే పనిభారం తగ్గుతుంది. మానసిక ఒత్తిడి దూరమవుతుంది.

**తక్షణం కాకపోతే..** కొన్ని పనులు ముఖ్యమైనవే అయినా.. వెంటనే చేయాల్సిన అవసరం ఉండదు. దీర్ఘకాలిక లక్ష్యాలు కోసం పూర్తి చేయాల్సిన ప్రాజెక్టులుంటాయి. వీటిని వ్యూహాత్మకంగా, ప్రణాళికా బద్ధంగా చేయాలి. దీనికంటూ రోజూ కొంత సమయాన్ని కేటా యించుకోవాలి. ప్రశాంతంగా పూర్తి చేసే పనుల్లో సత్ఫలితాలుంటాయి.

**ప్రతిరోజూ ..** ఆఫీసుకు రాగానే ఆ రోజు చేయాల్సిన పనులను అత్యవసరం, అవసరం అంటూ విభజించుకోవాలి. వాటిని ప్రణాళికమేరకు పూర్తిచేయగలగాలి. ఆరోగ్యకరమైన జీవనశైలి ధ్యానం, వ్యాయామాలకు చోటివ్వాలి.

# 18వ విడత తనిఖీలు

ఎంపిడివో ఫజుల్ రహిమాన్

మైదుకూరు ఆగష్టు 3, ప్రభాతవార్త :

సామాజిక తనిఖీలలో భాగంగా ఆగష్టు 3వ తేది నుండి 12వ తేది వరకు మైదుకూరు మండలానికి సంబంధించిన 2023 - 2024 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనుల మీద 18వ విడత తనిఖీలు అన్ని గ్రామ పంచాయతీలలో తనిఖీ చేయడం జరుగుతుందని ఎంపిడివో ఫజుల్ రహిమాన్ తెలియజేశారు.

# గోధుమ మిఠాయి

**కావలసినవి :** గోధుమపిండి-ఒకటిన్నర కప్పు, పాలపొడి-కప్పు, నెయ్యి-టేబుల్‌స్పూన్, వేడి పాలు-ముప్పావు కప్పు, బేకింగ్ పౌడర్- అర చెంచా, నూనె-వేయించేందుకు సరిపడా, పంచదార-2 కప్పులు, యాలకులు-3, జీడిపప్పు, బాదం, పిస్తా పలుకులు-పావు కప్పు.



**తయారీ :** వెడలానపటి గిన్నెలో గోధుమ పిండి, పాలపొడి, బేకింగ్ పౌడర్ వేసి, వేడి పాలతో కలపాలి. బాగా కలిపి, పిండి మెత్తగా అయ్యిందనుకున్నాక మందమైన చపాతీలా ఒత్తుకోవాలి. సీసా మూత సాయంతో చిన్న చిన్న వృత్తాల్లా కట్ చేయాలి. వీటిని కాగుతున్న నూనెలో బంగారు రంగు వచ్చే వరకూ వేయించాలి. అడుగు భాగం మందంగా ఉన్న పాత్రలో పంచదార, యాలకులు, రెండు కప్పుల నీళ్లు పోసి.. రెండు నిమిషాలు మరిగించి దించాలి. వేగిన సర్కిల్స్‌ను ఈ పాకంలో వేసి, రెండు గంటలు నాననివ్వాలి. వాటి మీద డ్రైఫ్రూట్స్ పలుకులు చల్లితే సరి రుచికరమైన గోధుమ మిఠాయి రెడీ.

# పిల్లలు బొమ్మలు వేస్తున్నారా!

అక్షరాలు రాకపోయినా పిల్లలు బొమ్మలు గీయడం, రంగులు వేయడం వంటివి ఎంచక్కా చేసేస్తారు. ప్రీస్కూల్లోనే వీళ్లకి ఇవి పరిచయం అవుతున్నాయి. అంటే పెన్సిల్ ఎంతముఖ్యమో రంగు పెన్సిళ్లే, క్రేయాన్లూ అంతే అవసరమనేగా! మనమేమో. అరెరే ఎంత చక్కగా బొమ్మలు గీస్తున్నారో, ఎంత ముచ్చటగా రంగులద్దుతున్నారో' అని పెద్ద పెద్ద కలరింగ్ బాక్సులు కొని తెచ్చేస్తాం. వాళ్లేమో అన్నింటినీ కలగాపులగం చేస్తారు. అంతటితో ఆగుతారా? ఎంత ఖర్చు పెట్టి కొన్నవైనా వాళ్లకి కొద్దిరోజుల్లోనే బోర్ కొట్టేస్తాయి.



వాటిని విరిచేయడం, పడేయడం సరేసరి. ఇక్కడ రంగు లేకపోయినా మళ్లీ బాక్సు అంతా కొనాల్సిందే ఆ పాత వాటిని వేయడానికి మళ్లీ ఓ డబ్బా వెతకాలి. ఎందు కొచ్చిన శ్రమ ఇదంతా? పైగా డబ్బులూ వృథా వీటన్నింటికీ 'మినీ'నే ఉపాయం. ఏం లేదండీ..

కలర్ పెన్సిళ్లు, క్రేయాన్స్ చిట్టి సైజుల్లో దొరుకుతాయి. వాటిని తెచ్చేయండి. ఇవైతే చక్కగా డబ్బాల్లోనూ వస్తాయి. పనయ్యాక వాళ్లే దానిలో సర్దుకుంటారు. ఖర్చూ తక్కువే కాబట్టి, పోగొట్టినా, బోర్ కొట్టాయన్నా కొనడానికి మనకి ఇబ్బంది అనిపించదు ఏమంటారు?



# ఇవి పంచుకుంటున్నారా..



ఆపాదమస్తకం అందంగా మెరిసిపోవలని అందరికీ ఉంటుంది. అందుకోసం మేకప్‌ను కూడా ఆశ్రయిస్తూ ఉంటాం. ఈ క్రమంలో కొందరు మేకప్ ఉత్పత్తులు అందులో ఉపయోగించే బ్రష్‌లను సైతం ఇతరులతో పంచుకొంటూ ఉంటారు. మీరూ అంతేనా? అయితే జాగ్రత్త! అలా చేయడం వల్ల చర్మానికి హాని కలిగే అవకాశాలు చాలానే ఉన్నాయంటున్నారు నిపుణులు. మరి, సౌందర్య సంరక్షణలో భాగంగా ఏయే ఉత్పత్తులను ఇతరులతో పంచుకోకూడదో తెలుసుకుందామా..



స్నేహితులు లేదా బంధువుల్లో ఎవరివైనా లిప్‌స్టిక్/లిప్‌గ్లాస్/మేకప్ నరబష్.. ఇలా ఏది కనిపించకపోయినా వెంటనే పక్కనున్న వాళ్లు ఇదిగో.. నాది తీసుకో అంటూ అందించడం లేదంటే మనమే వాళ్లను అడగడం సర్వసాధారణమే. అయితే ఆ క్షణానికి అందంగా కనిపించడానికి అది ఉపయోగ పడినా ముందు ముందు మాత్రం సౌందర్యపరంగా చాలా నష్టాలే ఎదుర్కోవాల్సి రావచ్చు. అందుకే సౌందర్య సంరక్షణలో భాగంగా కొన్ని ఉత్పత్తులను ఇతరులతో అస్సలు పంచుకోకూడదు.

**పౌడర్ రూపంలో ఉంటే...** మేకప్‌లో ఉపయోగించే ఫౌండేషన్, ఐ షాడో.. వంటివి కొన్ని పౌడర్ రూపంలో కూడా ఉంటాయి. అయితే వీటిని ఒకరి కంటే ఎక్కువమంది చేతితో తాకినా లేదా బ్రష్‌తో అప్లై చేసుకున్నా అందులో బ్యాక్టీరియా చేరే అవకాశాలు ఎక్కువ. ఫలితంగా మొటిమలు రావడం, చర్మ సంబంధిత ఇన్ఫెక్షన్లు దరిచేరడం వంటి సమస్యలు రావచ్చు. కాబట్టి పౌడర్ రూపంలో ఉన్న ఉత్పత్తులను ఇతరులతో అస్సలు పంచుకోకూడదు.

**లిప్‌స్టిక్/లిప్‌గ్లాస్:..** చాలామంది రంగు బాగుందనో లేక మంచి లుక్ ఇస్తుందనో ఇతరుల లిప్‌స్టిక్/లిప్‌గ్లాస్ ఉపయోగిస్తూ ఉంటారు. అయితే ఇతరులవి మనం ఉపయోగించడం వల్ల వాటిపై ఉన్న బ్యాక్టీరియా మన అధరాల పైకి చేరే అవకాశాలు లేకపోలేవు. అలాగే మన అధరాలపై ఉన్న తేమలో ఉండే బ్యాక్టీరియా కూడా వాటికి తోడై పెదాలకు హాని కలిగించవచ్చు. కాబట్టి ఇవి కూడా ఎవరివి వారూ ఉపయోగించుకోవడం శ్రేయస్కరం.

**కళ్ల సంబంధిత ఉత్పత్తులు.....** ఐ షాడో, మస్కారా, ఐ లైనర్.. వంటి ఐ మేకప్ ఉత్పత్తులను చాలా జాగ్రత్తగా ఉపయో గించాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఇతరుల ఐ మేకప్ ఉత్పత్తులు ఉపయోగించేటప్పుడు వారికి ఏమైనా కళ్ల సంబంధిత ఇన్ఫెక్షన్లు ఉంటే అవి మనకు కూడా వచ్చే అవకాశాలు లేకపోలేవు. అలాగే ఆ ఉత్పత్తుల్లోని బ్యాక్టీరియా వల్ల కళ్లు ఎర్రబడడం, నీళ్లు కారడం, మండడం.. వంటి సమస్యలు కూడా తలెత్తుతాయి.

**మూతలు ఉండేవి..** కొన్ని రకాల క్రీమ్‌లు, పౌడర్లు మూతలు ఉండే చిన్న చిన్న సీసాల్లో లభ్యమవుతుంటాయి. వీటిని కూడా ఇతరులతో పంచుకోకూడదు. అలా షేర్ చేసుకోవడం వల్ల వారు ఉపయోగించినప్పుడు వారి చేతుల్లో ఉండే హానికారక బ్యాక్టీరియా ఈ ఉత్పత్తుల్లోకి చేరుతుంది. అవి మనం వాడడం వల్ల మన చర్మానికి కూడా నష్టం వాటిల్లుతుంది.

**మేకప్ బ్రష్‌లు...** మేకప్ వేసుకోవడానికి ఉపయోగించే బ్రష్‌లను కూడా ఇతరులతో పంచుకోకూడదు. ఇతరులు వాటిని



ఉపయోగించినప్పుడు వారి చర్మం మీద ఉండే బ్యాక్టీరియా, క్రిములు వంటివి మేకప్ ఉత్పత్తుల్లోకే కాదు. వాటిని తిరిగి మనం ఉపయోగించినప్పుడు మన చర్మం మీదకు కూడా చేరతాయి. కాబట్టి మేకప్ వేసుకోవ డానికి ఉపయోగించే బ్రష్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవడంతో పాటు ఇతరులతో పంచుకోకుండా ఉండడం మంచిది.

ఇవి కూడా.. లిక్విడ్ ఫౌండేషన్, లిక్విడ్ ఐ లైనర్, క్రీమ్ రూపంలో ఉండే ఉత్పత్తులు, నెయిల్‌పాలిష్, హెయిర్ బ్రష్‌లు, క్లెన్సింగ్‌కి ఉపయోగించే స్పాంజ్‌లు మేకప్ వేసుకోవడానికి వాడే పఫ్‌లు, ఐ లాష్ కర్లర్, ట్వీజర్స్, ప్లక్కర్స్, లిప్‌బామ్, స్నానానికి ఉపయోగించే ఉత్పత్తులు, సాధనాలు.. మొదలైనవన్నీ ఇతరులతో పంచుకోకుండా ఉండడం మంచిది.



## బిడ్డకు తల్లి ముర్రుపాలు అమృతంతో సమానం

**రామాపురం, ఆగస్టు 3, ప్రభాతవార్త:**



బిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానమని ల క్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్ సీడీపీవో వై.పద్మావతి అ న్నారు. మండలంలోని గువ్వల చెరువు క్లస్టర్ పరిధిలోని గువ్వల చెరువు క్లస్టర్ పరిధిలోని కసి రెడ్డిగారిపల్లె పంచాయతీ సుగాలిబిడికిలో శనివా రం అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్స వాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై ప్రసంగించారు. బిడ్డకు పుట్టిన మొదటి గంటలోనే తల్లిపాలు పట్టడం వల్ల వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. శిశువు తల్లిపాలు తాగడం వల్ల ఇన్ఫెక్షన్ రాకుండా నిరోధిస్తుందన్నారు. ఈ సందర్భంగా బాలింతలకు అవగాహన కల్పించా రు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు హుసేనమ్మ, తులసమ్మ, పద్మజ రాణి, సుజాతరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

## విద్యుత్తు ప్రమాదాల నివారణకు సిబ్బంది ట్రీ కటింగ్

**తంబళ్లపల్లె, ఆగస్టు 3, ప్రభాతవార్త:**



తంబళ్లపల్లె మండల పరిధిలో ఈ మధ్య కాలంలో ఈదురు గాలులు, బారి వర్షాలతో పలు చోట్ల 33 కేవీ విద్యుత్తు లైన్లపై చెట్లు కొమ్మలు పడి విద్యుత్తు సమస్యలు తరచూ ఏర్పడేవి. ఈ సమస్యపై విద్యుత్తు శాఖా ధికారుల ఆదేశాల మేరకు శనివారం తంబళ్లపల్లె విద్యుత్తు శాఖ ఏఈ శేషు, లైన్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ యుద్ధ ప్రాతిపదికన స్పందించారు. ఉద యం నుంచి కురబలకోట మండలం ముదివేడు విద్యుత్తు సబ్ స్టేషన్ నుంచి తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లె విద్యుత్తు సబ్ స్టేషన్ వరకు ముందస్తుగా 33 కేవీ విద్యుత్తు లైన్లపై విస్తరించిన చెట్టు కొమ్మలను తొలగించే కార్యక్రమం ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా ఈఏ మా ట్లాడుతూ విద్యుత్తు ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

## తల్లిపాల వారోత్సవాలలో భాగంగా తల్లులకు అవగాహన

**పీలేరు, ఆగస్టు 03 ప్రభాతవార్త:**



బిడ్డ పుట్టిన రెండు రోజులు తల్లిపాలు చిక్క గా పసుపుపచ్చగా ఉండే ముర్రుపాలలో ప్రోటీ న్లు, రోగాలను ఎదుర్కొనే శక్తిని కలిగి ఉంటా యని పుట్టిన గంటలోపు బిడ్డకు పట్టడం క్షేమ దాయకమని హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య త ల్లులకు సూచించారు. శనివారం స్థానిక మో డల్‌కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపా ల వారోత్సవాల్లో భాగంగా తల్లులకు అవగా హన కార్యక్రమాలు నిర్వహించారు. తల్లిపాలు శిశువుకి అత్యంత సహజమైన సురక్షితమైనవి, పుష్టికరమైన ఆహారమని బిడ్డ యొక్క మానసిక శారీరక వికాసానికి ఎదుగుదలకు దోహదపడతాయని పగ లు రాత్రి కలిపి బిడ్డకు కనీసం 8 నుంచి పదిసార్లు ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ప ట్టాలని, ఈ సమయంలో తల్లి వ్యక్తిగత చేతుల శుభ్రత పాటించాలని కొండయ్య తల్లులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పర్యవేక్షకులు అక్కాయమ్మ, ఏఎన్ఎం లక్ష్మీ, అంగన్‌వాడీ టీచర్సు, ఆశ కార్యక ర్తలు పాల్గొన్నారు.

## క్షేత్ర ప్రదర్శనలో సీఎన్ఆర్ కళాశాల విద్యార్థులు

**పీలేరు, ఆగస్టు 03 ప్రభాతవార్త:**



స్థానిక సీఎన్ఆర్ కళాశాల సైన్సు విద్యా ర్థులు క్షేత్రప్రదర్శనలో భాగంగా పీలేరు మండలంలోని వేపులబైలు పంచాయతీ రె డ్డివారిపల్లె గ్రామానికి చెందిన రైతు రత్న శేఖర్‌రెడ్డితోటను శనివారం సందర్శించా రు. ప్రకృతి వ్యవసాయ నిపుణులు బోదే షావలి ఆధ్వర్యంలో ఎకరం పొలంలో దా దాపు 80 రకాల పండ్ల చెట్లను సుమారు 150 చెట్లును ప్రకృతి వ్యవసాయ విధానం లో పండించడం జరుగుతుంది. ఇది తెలుసుకున్న కళాశాల అధ్యాపకులు తమ విద్యార్థులను ఒక్క రోజు క్షేత్ర ప్రదర్శనలో భాగంగా రైతు రత్నశేఖర్‌రెడ్డి పండిస్తున్న రకాలను అదేవిధంగా అవలంభిస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులను గురించి తెలుసుకోవడం జరిగింది. ప్రకృతి వ్యవసాయ విధానంలో తయా రుచేసుకునే జీవామృతం ఘన జీవామృతం, ఇతర ఎరువులైన పంచగవ్య, మీనామృతం పులిసిన పండ్లద్రా వణం, పూల ద్రావణం అదేవిధంగా ఆకుల ద్రావణాన్ని కూడా బోదేషావలి వివరించడం జరిగింది. తరు వాత విద్యార్థులు పీలేరు పరిసర ప్రాంతాల్లో రైతులు పండిస్తున్న వేరుసెనగ పొలాన్ని కూడా సందర్శిం చి వాటిని ఆశించే చీడపీడలు బ్యాక్టీరియా, బూజు తెగులను కూడా ఈక్షేత్ర ప్రదర్శనలో తెలుసుకున్నారు. విద్యార్థులు రత్నశేఖర్‌రెడ్డి పొలాన్ని సందర్శించటం ఎంతగానో ఉపయోగపడిందని ఆనందం వ్యక్తపరిచా రు. ఈ కార్యక్రమంలో సీఎన్ఆర్ కళాశాల అధ్యాపకులు, జ్ఞానశ్రీ, అజిత, ప్రకృతి వ్యవసాయ నిపుణుడు బోదేషావలి పాల్గొన్నారు.

## వర్షాభావంతో మినుముపంట దున్నివేసిన రైతన్న

**వీరపునాయునిపల్లె, ఆగస్టు 3, ప్రభాతవార్త :**



మండలంలో తీవ్ర వర్షాభావం నెలకొనడంతో పంటలు వేసిన రైతన్నలు తీవ్రంగా నష్టపోయా రు. ఉరుటూరు గ్రామంలో శనివారం మినుము పంటను రైతులు ట్రాక్టరుతో దున్నివేశారు. మం డలంలో మినుముపంట దాదాపుగా 800 ఎక రాలకు పైచిలుకు వేయడం జరిగింది. అలాగే వే రుశెనగ, పత్తి, తదితర పంటలు కూడా వేశారు. కానీ వర్షం కురవకపోవడంతో వాటిని తీసివేసే పరిస్థితి ఉంది. ప్రభుత్వం వైపు నుండి సహాయ, సహకారాలు అందకపోతే ఆత్మహత్యలే శరణ్యం అని రైతులు వాపోతున్నారు. ఇక్కడ సర్వరాయసాగర్ ప్రాజెక్టు ఉన్నప్పటికీ ప్రధాన కాలువలు, ఉప కాలువలు పూర్తి చేయకపోవడంతో ఇలాంటి సమయంలో నీటిని వాడుకునేందుకు వీలు లేకుండా పోయిందని రైతు లు అంటున్నారు. అదే సకాలంలో పాలకులు ఈ సర్వరాయసాగర్‌కు ప్రధాన కాలువలు పూర్తి చేసి ఉప కాలువలను కూడా ఏర్పాటు చేసి ఉంటే తమకు ఈ రోజు ఈ దుస్థితి వచ్చేది కాదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పాలకుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లి రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. మినుముపంటకు ఎకరాకు కౌలు రూ.5వేల నుండి రూ.8వేల వరకు ఉంటుం దని రైతులు చెబుతున్నారు. ఈ పెట్టుబడి కూడా భారీగానే ఉంటుందని, తమకు ప్రభుత్వం సహాయ, సహకారాలు అందించాలని రైతులు కోరుతున్నారు. ఈ పరిస్థితుల్లో తమను ఆదుకోవాలని వారు కోరు తున్నారు. 2005లో సర్వరాయసాగర్ పనులు ప్రారంభించారు. 2015 కల్లా పూర్తి కావాలి. సర్వరా యసాగర్ కింద వీరపునాయునిపల్లె, ఎర్రగుంట్ల, తదితర మండలాల్లో దాదాపు 25వేల ఎకరాలకు సాగు నీరు అందించే లక్ష్యంగా ఏర్పాట్లు చేశారు. కొంతమేరకు ప్రధాన కాలువలు తీసినప్పటికీ వాటికి నీరందించే పరిస్థితి కూడా లేదు. డ్యామ్‌లో కొంతమేర నీరు ఉన్నప్పటికీ వాటిని సద్వినియోగం చేసుకునే అవకాశం లేదని రైతులు వాపోతున్నారు.

## మధ్యాహ్న భోజన పథకాన్ని పున:ప్రారంభించాలి

**పులివెందుల రూరల్, ఆగస్టు 3, ప్రభాతవార్త :**




ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భో జన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం పున:ప్రారంభించా లని ప్రగతిశీల విద్యార్థి యువజన సంఘం జిల్లా క న్వీనరు ఓరుగంటి నాగేంద్రబాబు డిమాండ్ చేశారు. శనివారం పులివెందులలోని వైఎస్‌వీఆర్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులతో కలిసి ఆయన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగానాయన మా ట్లాడుతూ 2019లో వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం అధికా రంలోకి రాగానే మధ్యాహ్న భోజన పథకాన్ని ఆపేశారని తెలిపారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ తక్షణమే స్పందించి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు తిరిగి మధ్యాహ్న భోజన పథకాన్ని పున:ప్రారంభించాలని, ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థుల సంక్షేమానికి తోడ్పాటునందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్ఎస్‌వైఎఫ్ రా ష్ట్ర నాయకులు వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

## నవజాత శిశువుకు తల్లిపాలే అమృతం

**వేంపల్లె, ఆగస్టు 3, ప్రభాతవార్త :**



నవజాత శిశువులకు తల్లిపాలే అమృతమని తాళ్లపల్లె పీహె చ్‌సీ హెల్త్ ఎడ్యుకేటరు షపివున్నీసాబేగం అన్నారు. వేంపల్లె మండలంలోని తాళ్లపల్లెలో శనివారం అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లి పాల యొక్క విశిష్టత గురించి ఆమె వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజరు నాగరత్న, సీహెచ్‌వో వెంకటరత్నం, సూపర్‌వై జరు వెంకటలక్ష్మి, ఏఎన్ఎం అరుణ, జ్యోతి, తదితరులు పా ల్గొన్నారు.

## సూపర్‌సిక్స్ పథకాలు అమలయ్యేదెన్నడో?

**వేంపల్లె, ఆగస్టు 3, ప్రభాతవార్త :**



కూటమి ప్రభుత్వం ప్రజలకు సూపర్‌సిక్స్ పథకాలను ఆశగా చూపి ఓట్లు వేయిం చుకుని అధికారంలోకి వచ్చారని, మరి ఆ పథకాలను ఎప్పుడు అమలు చేస్తారని ఏపీసీసీ మీడియా ఛైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి కూటమి ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. సామాజిక పిం ఛన్లను తప్ప ఏ పథకాన్ని అమలు చేయలేదని ఆయన అన్నారు. నిరుద్యోగ యువ తకు నెలకు రూ.3వేలు భృతి, తల్లివందనం కింద స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15వేలు, రైతన్నలకు ఏటా రూ.20వేలు ఆర్థికసాయం, ప్రతి మహిళ కు నెలకు రూ.1500, ప్రతి ఇంటికీ ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, మహి ళలకు ఉచిత బస్సు ప్రయాణం, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనార్టిలకు 50ఏళ్లకే పింఛను ఇస్తామని ప్రకటించారన్నారు. ప్రస్తుతం ఖజానాచూస్తే ఖాళీగా ఉందని, ప్రభుత్వం శ్వేతపత్రాల పేరుతో సాకుప త్రాలు విడుదల చేసి పలాయనవాదం పాటిస్తోందని తులసిరెడ్డి అన్నారు. ఆలస్యం చేయకుండా వెంటనే పథకాలు అమలు చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

## ఆర్జీయూకేటీ కౌన్సెలింగ్‌కు రెండవ జాబితా విడుదల

**వేంపల్లె, ఆగస్టు 3, ప్రభాతవార్త :**



రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాల యం పరిధిలోని ఇడుపులపాయల, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీలకు సంబంధించి రెండవ విడత కౌన్సెలింగ్ ఎంపిక జాబితాను అ డ్మిషన్ల కన్వీనరు ప్రొఫెసర్ అమరేంద్ర సంద్రా, ఆర్.కె.వ్యాలీ డైరెక్టరు కుమారస్వామిగుప్తా, క్యాం పస్ కన్వీనరు రవికుమార్, అకడమిక్ డీన్ రత్న కుమారిలు శనివారం విడుదల చేశారు. విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ 735 సీట్లు మిగిలా యని, వీటిని భర్తీ చేసేందుకు రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్.కె.వ్యాలీ, ఒం గోలు ట్రిపుల్‌ఐటీలకు ఎంపికైన విద్యార్థులు ఈనెల 9న ఆర్.కె.వ్యాలీ క్యాంపస్‌లో నిర్వహించే కౌన్సెలిం గ్‌కు హాజరు కావాలని తెలిపారు. నూజివీడు, శ్రీకాకుళం క్యాంపస్లకు ఎంపికైన విద్యార్థులకు అదేరోజు నూజివీడులో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్సులు కూడా తీసుకురావాలని వారు కోరారు.

**- 82మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక :** ఇడుపులపాయ ఆర్.కె.వ్యాలీ ప్రాంగణం ఉద్యోగ ఎంపికలో న్యాక్ టెక్నాలజీస్ కంపెనీకి చెందిన 82మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు డైరెక్టరు కుమారస్వామి గుప్తా తెలిపారు. ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూ.6లక్షలు వేతనం ఇవ్వనున్నట్లు చెప్పారు. తమ కళాశాల విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక కావడం పట్ల ఆర్జీయూకేటీ వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ విజ య్‌కుమార్, డైరెక్టరు కుమారస్వామిగుప్తా, ప్రొఫెసర్ అమరేంద్రసంద్ర, పరిపాలనాధికారి డాక్టర్ రవికు మార్, అకడమిక్ డీన్ రత్నకుమారి, ప్లేస్‌మెంట్ అధికారులు వినోద్, సుందర్, రవిబాబులు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

## క్రీడలను ప్రోత్సహిస్తాం..

**కడప వైద్య విభాగం, ఆగస్టు 3, ప్రభాతవార్త:**



క్రీడలను ప్రోత్సహిస్తామని క్రీడాకారులకు అన్ని విధాలా ఆదుకుంటామని ప్రముఖ సం ఘ సేవకుడు సయ్యద్ సలావుద్దీన్ తెలిపారు. ధోని ట్రోఫీ 2024 షెడ్యూలు లాంచ్ ఈవెం ట్‌లో సలావుద్దీన్ ప్రసంగించారు. ప్రముఖ క్రికెటర్ ధోని భారత దేశ క్రికెట్ అభివృద్ధిలో ఎంతగానో ఉపయోగపడ్డారని తెలిపారు. యు వ క్రీడాకారులకు సూచనలు, సలహాలు ఇవ్వ డంలో ఇప్పుడు ముందున్నారని గుర్తు చేశా రు. ఆయన క్రికెట్ క్రీడాకారులను ఎంతగానో ప్రోత్సహిస్తున్నారని కొనియాడారు. కేకేఆర్ అ ధ్యక్షుడు తారీక్ అలీ ద్వారా ఎంతో మంది క్రీడాకారులకు అవకాశాలు ఇచ్చారన్నారు. అలాగే క్రీడలు యు వకులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కేకేఆర్ అధ్యక్షుడు తారీక్ మాట్లాడుతూ ధోని గొప్ప క్రీడా కారుడిగా ఎదగడానికి అన్ని మంచి లక్షణాలున్నాయి కాబట్టే ఆయన పెద్ద స్థాయి క్రికెట్ ఆడారన్నారు. ధోని ట్రోఫీ 2024 ఆగస్టు 3 నుంచి కడప నగరంలోని నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం సయ్య ద్ సలావుద్దీన్ పోస్టరు లాంచ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తాజ్, బాలాజీ, నిర్వాహకులు పా ల్గొన్నారు.

## కడపలో ఉచిత మెగా ఆక్యుపంక్చర్ వైద్య శిబిరం

**కడప వైద్య విభాగం, ఆగస్టు 3, ప్రభాతవార్త:**

కడప నగరం గురుకుల విద్యాపీఠ్ స్కూలు పాత బైపాస్ రోడ్డు కడప వద్ద ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచితంగా ఆక్యుపంక్చర్ వైద్యశిబిరాన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈ శిబిరానికి ముఖ్య అతిథులుగా కడప ఎమ్మెల్యే శ్రీమతి ఆర్.మాధవిరెడ్డి, తెదేపా పార్లమెంటు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డిలు గౌరవ అతిథులుగా ఏవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ అధినేత వెంకటేశ్వర్లు హాజ రవుతారన్నారు. ఈ కార్యక్రమంలో మైగ్రేన్, పక్షవాతం, ముఖ పక్షవాతం, జీర్ణ సమస్యలు, నరాల బల హీనత తదితర వ్యాధులకు ఉచిత వైద్య సేవలు నిర్వహిస్తున్నట్లు డా.గిరీష్, మల్లెల రామంజులు తెలిపారు.

## నేడు చౌడేశ్వరి దేవి ఉత్సవం..

**తంబళ్లపల్లె, ఆగస్టు 3, ప్రభాతవార్త:**

తంబళ్లపల్లె మండలం పరసతోపు పంచాయతీ బురుజులో వెలసిన స్థానిక ప్రజల ఆరాధ్య దైవం చౌడే శ్వరిదేవి ఉత్సవం ఆదివారం చౌడేశ్వరిదేవి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహ కుదు మగ్గాలు లక్ష్మయ్య తెలిపారు. ఆదివారం ఉదయం చౌడేశ్వరి మాతకు పుష్పాభిషేకంతో ప్రత్యేక అలంకరణ అనంతరం అర్చనలు, అభిషేకాలు, దూపదీప నైవేద్యాలతో మహిళలు ప్రత్యేక పూజలు ఎనిర్వ హిస్తారన్నారు. అదే విధంగా తమ ఇష్టదైవం చౌడేశ్వరిదేవికి మొక్కుబడులు చెల్లించుకుంటారు. ఏపీతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి రానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని భక్తులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

### మెరుగైన సాగు పద్ధతులు పాటించినప్పడే

## మిర్చి రైతులకు నిజమైన లాభాలు

**మైదుకూరు రూరల్,ఆగష్టు 03,ప్రభాతవార్త:**



కృషి విజ్ఞాన కేంద్రం ఒనిపెంట నందు మిరప సాగులో మెలకులపై శిక్షణ కార్యక్ర మం నిర్వహించారు. రెండవ రోజు మిరప సాగులో తెగుళ్ల నివారణ ముఖ్య అంశాలుగా వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ కరుణ శ్రీ విస్తరణ సంచాలకులు అధ్య క్షతన వివరించారు. మిర్చి నాటిన ఒక నెల తర్వాత త్రిప్స్ నష్టాన్ని అధిగమించడానికి బ్లూస్టిక్‌ట్రాప్ లను ఉంచడం గురించి రైతుల కు వివరించారు. డాక్టర్ ఎమ్,బాలకృష్ణ, సీనియర్ శాస్త్రవేత్త మరియు అధిపతి మా ట్లాడుతూ సమగ్ర పంట యాజమాన్య పద్ధతులు జీవన ఎరువులు గురించి వివరించారు.అనంతరం డాక్టర్ బి నాగేంద్ర రెడ్డి,శాస్త్రవేత్త అరటి పరిశోధన విభాగం పులివెందుల రైతులకు మిరప లో తెగుళ్ల, చీడపీడలు నిర్వహణ గురించి వివరించారు.డాక్టర్ ఫిరోజ్ హుస్సేన్ శాస్త్రవేత్త ఉద్యాన కెవికె మిరప సా గులో ముఖ్యమైన సమస్యలు వాటి నిర్వహణ గురించి వివరించారు.డాక్టర్ బి ఎస్ కాంతి శ్రీ శాస్త్రవేత్త గృహ విజ్ఞానం మిరపలో విలువలు జోడింపు గురించి వివరించారు.శిక్షణ కార్యక్రమంలో భాగంగా విస్తర ణ సంచాలకులు శాస్త్రవేత్తలతో కలిసి సుంకుల గారి పల్లె,మాచువారిపల్లె,మిట్టమానుపల్లె గ్రామాలలో రైతులు నేల సంపెంగ, బంతి రైతులు వీరితోపాటు సందర్శనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమమును జయప్రదం చేశారు.

## రైతు సేవా సమితి నిర్మాణ మహాసభను జయప్రదం చేయండి

**మైదుకూరు రూరల్,ఆగష్టు 03,ప్రభాతవార్త:**

కడప జిల్లా మైదుకూరు నియోజవర్గంలో గత మూడు సంవత్సరాలుగా రాజకీయ పార్టీలకు అతీ తంగా స్వతంత్రముగా రైతు సమస్యలతో పాటు ప్రజా సమస్యలపైన ఉద్యమిస్తున్న రైతు సేవా సమితి మైదుకూరు నియోజవర్గానికి నిర్మాణ మహాసభ ఈ నెల 12వ తేదీ మైదుకూరు లో జరుగుతున్నందున రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఒనిపెంటలో రైతు సేవా సమితి మైదుకూరు నియోజకవర్గ అధ్యక్షులు సహదేవుడు ఆధ్వర్యంలో జరిగిన మహా సభ కరపత్ర విడుదల కార్యక్రమంలో రైతులను కోరిన రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఏవి,రమణ ఈ సందర్భంగా హాజరైన రైతులను ఉద్దేశించి రమణ మాట్లాడుతూ రాష్ట్రంలో గత పది సంవత్సరాలుగా పాలన చేస్తున్నటువంటి రాజకీయ పార్టీలు రైతు అభివృద్ధి కోసం ఎటువంటి చర్యలు చేపట్టలేదని రైతు కోసం పెండింగ్లో ఉన్న సాగునీచి ప్రాజెక్టులు గాని, నూతన ప్రాజెక్టులు గాని చేపట్టలేదని ఈలాగే వరాషలు పడక కరువు వల్ల పంటలు పండక రైతు నష్ట పోయిన పంటలు పండిన కనీస ధరలు కూడా లేక రైతు నష్టపోయిన కాలంలో రాష్ట్రాన్ని పాలించి నటువంటి వారు ఏవిధంగా సహాయ పడలేదని భవిష్యత్తులో కూడా రైతులు తమ హక్కుల కోసం ఐకమత్యంగా ముందుకు వచ్చి ఉద్యమించకపోతే రైతుకు ఆత్మ హత్యలే శరణ్యమని కావున రైతుందరూ రాజకీయాలకు అతీతంగా ఐకమత్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడ సహదేవుడు, రామంజనేయ రెడ్డి, రమేష్ శంకర్, పోలయ్య, ఓబులేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో అంటువ్యాధులపై స్పెషల్ డ్రైవ్ : ఎంపిడిఓ

**మదనపల్లె, ఆగస్టు 3 ప్రభాతవార్త :**



గ్రామాల్లో ప్రజలు అంటువ్యాధుల బారిన పడకుండా స్పెషల్ డ్రైవ్ నిర్వ హిస్తున్నట్లు ఎంపిడిఓ భానుప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండల పరిధిలోని ప్రతి గ్రామంలోనూ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో సంబంధిత సెక్రటరీల ద్వారా పారిశుద్ధ్య కార్మికులతో పారిశుద్ధ్య పనులు చేప డుతున్నట్లు తెలిపారు. ఈనెల 10వరకు గ్రామ గ్రామాన స్పెషల్ డ్రైవ్ ఉం టుందన్నారు. మురుగునీటి కాలువలు శుభ్రం చేసి దోమల నివారణకు పాల్‌థి న్ పిచకారి చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా డయోరియా, డెంగ్యూ, మలేరియా వ్యాధిన పడకుండా ప్రజలకు వ్యాధులపట్ల అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత వైద్యశిబ్బంది ద్వారా కూడా ప్రజ లకు వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తున్నామన్నారు. నీటి ఎద్దటి నివారణకు కూడా ప్రత్యేక చర్యలు చేప ట్టనున్నట్లు తెలిపారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతం చేద్దాం

**మదనపల్లె, ఆగస్టు 3 ప్రభాతవార్త :**




స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవం తం చేద్దామంటూ ఉత్సవ కమిటీ సభ్యులు పిలు పునిచ్చారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కమిటీ కన్వీనర్ కె.రఘు నాథ్‌రెడ్డి, కో కన్వీనర్లు రాటకొండ గురుప్రసాద్, ఆర్.కేశవరెడ్డిలు మాట్లాడుతూ స్వాతంత్ర్య దినో త్సవ ఉత్సవాల నిర్వహణకు కమిటీ ఏర్పాటు చే స్తున్నట్లు తెలిపారు. ప్రతి ఏటా తరహాలోనే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా జరిపేందుకు సహకరించాలన్నారు. 7వతేది నుంచి వారం రోజులు పాటు ముందస్తు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుపుకొని 14న అర్ధరాత్రి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు వైభవంగా జరపనున్నట్లు తెలిపారు. వారం రోజులు పాటు ప్రతి రోజూ స్వాతంత్ర్య దినోత్సవానికి సంబంధించి ఓ కార్యక్రమాన్ని నిర్వహించడం జరు గుతుందన్నారు. విద్యాసంస్థలు, మేధావులు, ప్రజాసంఘాలు, ప్రజాప్రతినిధులు, నాయకులు స్వాతంత్ర్య దినోత్సవానికి సహకరించి విజయవంతం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ట్రెజరర్ ఎం.క్రిష్ణప్ప, కుమా ర్‌రెడ్డి, దుర్గాప్రసాద్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ బండి ఆనంద్, గౌరవ అధ్యక్షులు డాక్టర్ ఎన్.సేతు, కామకోటి ప్రసాద్‌రావు, క్రిష్టారెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వెలుగుస్కూల్‌లో అవయవ దానదినోత్సవ వేడుకలు

**మదనపల్లె, ఆగస్టు 3 ప్రభాతవార్త :**



పట్టణ సమీపంలోని కోళ్ళబైలు పంచాయితీ అమ్మచెరువుమిట్టలో గల వెలుగు సంస్థలో భా రత్ ప్రభుత్వం మహిళా, శిశు అభివృద్ధి మంత్రి త్వశాఖ వారి ఆదేశాల మేరకు శనివారం అవ యవ దానదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా వెలుగు సెక్రటరీ ఉదయ్‌మోహన్‌రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మి అవ యవ దానవిక ప్రాముఖ్యతను వివరించారు. నా మరణాంతరం నా అవయవాలు, ఖనజాలను దానం చేస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నానని అందరిచేత ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. అనంతరం ర్యాలీని ప్రారం భించారు. ర్యాలీలో అవయవ దానం గురించి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లీనాకు మారి, సిబ్బంది స్వీటి, చిన్నారులు పాల్గొన్నారు.

## తేనెటీగల దాడి ముగ్గురికి అస్వస్థత

**మదనపల్లెక్రైం, ఆగస్టు 3 ప్రభాతవార్త :**

తేనెటీగల దాడిలో ఒకే కుటుంబంలో ముగ్గురు గాయపడి తీవ్ర అస్వస్థకు గురయ్యారు. ఘటనపై బాధి తుల కుటుంబీకులు తెలిపిన వివరాలిలావున్నాయి. పెద్దమండ్యం మండలం శివపురం పంచాయితీ గొల్లప ల్లెకు చెందిన రైతు రెడ్డప్ప(60) కుమారుడు వెంకటేశ్వర(45), కొడలు వెంకటరమణమ్మ(35)లు ఊరికి సమీపంలో ఉన్న వ్యవసాయ బోరు వద్దకు వెళ్ళారు. వ్యవసాయ పనులు చేస్తున్న ముగ్గురిపై ఒక్కసారిగా పెద్ద పేరు తేనెటీలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. చికత్సల కోసం బాధితులను జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్సలు చేస్తున్నారు. వీరిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం డాక్టర్లు తిరుపతి రుయాకు రెఫర్ చేశారు.

## ట్రాక్టర్ ఢీకొని చిన్నారి మృతి

**మదనపల్లెక్రైం, ఆగస్టు 3 ప్రభాతవార్త :**



ట్రాక్టర్ ఢీ కొని ఓ చిన్నారి మృతి చెందిన సంఘ టన తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెలో చోటు చేసుకొంది. ఎస్ఐ కథనం మేరకు వివరాలిలావు న్నాయి. మండలంలోని కోసువారిపల్లెకు చెందని దం పతులు చరణ్, నందినిల కుమార్తె రూప(02) ఇం టిముందు ఆడుకొంటుండగా ట్రాక్టర్ వేగంగా వచ్చి ఢీ కొని వెళ్ళిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయ పడ్డ బాధిత చిన్నారిని కుటుంబీకులు చికిత్స కోసం వెంటనే మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. అత్యవసర విభాగదం డాక్టర్లు పరీక్షించే లోపు చిన్నారి మృతి చెందింది. బిడ్డ కళ్ళముందే ప్రాణాలు వదలడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. ఘటనపై తంబళ్ళపల్లె ఎస్ఐ శివకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## గెవితిమ్మరాయస్వామికి ప్రత్యేక పూజలు

**రామసముద్రం, ఆగస్టు 3 ప్రభాతవార్త :**

మండలంలోని దిన్నిపల్లె సమీపంలోని కొండపై వెలిసిన గెవితిమ్మరాయస్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు కులశేఖర్‌బట్టర్ స్వామివారికి ఉదయం ఆలయంను శుద్దిచేసి పలు రకాల పుష్పాలతో అలంకరణ చేసి అర్చనలు అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించి వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు గోవిందా గోవిందా అంటూ నామస్మరణలతో మారుమ్రోగిన గెవితిమ్మరాయస్వామి ఆలయం, చెంబకూరు రోడ్డులో ఉన్న శనేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి అర్చనలు, అభిషేకాలు, నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## ఇంటిపరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**రామసముద్రం, ఆగస్టు 3 ప్రభాతవార్త :**



మండలంలోని పెద్దకురప్పల్లె గ్రామ పం చాయితీ నారేవారిపల్లె గ్రామంలో పారిశుద్ధ్యకార్మి కులచే మందులను పిచకారి చేయించారు. ఈ సందర్భంగా పంచాయితీ సెక్రటరీ భానుమూర్తి మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామ అభివృద్దే తమ ధ్యేయమ న్నారు. పారిశుద్ధ్య కార్మికులు చేత మురికి కా లువలు వద్ద నీరు నిల్వ ఉండకుండా శుభ్రం చే యించారు. ఎలాంటి అంటువ్యాధులు, దోమలు కానీ ప్రబలకుండా ముందు జాగ్రత్తగా శుభ్రం చే యించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ సెక్రటరీ భానుమూర్తి, స్వప్న సచివాలయ సి బ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

## నేడు చౌడేశ్వరీదేవి జయంతి వేడుకలు

**మదనపల్లెక్రైం, ఆగస్టు 3 ప్రభాతవార్త :**

పట్టణంలోని నీరుగట్టువారిపల్లెలో వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మెన్ పురాణం చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ అమ్మవారికి ఉదయం పంచామృతాభిషేకం, ఆలయంలో ఉదయం 8గంటలకు ఉచిత వైద్య శిబిరం, మెగా రక్తదాన శిబిరం, మద్యాహ్నం 12గంటలకు అన్నదాన కార్యక్రమం, సాయంత్రం అమ్మ వారికి పల్లకి ఊరేగింపు పలు కార్యక్రమాలు నిర్వహిస్తామని కమిటీ ఛైర్మెన్ తెలిపారు.

## బి.కొత్తకోట కర్నాటక బార్డర్ వద్ద రోడ్డు ప్రమాదం

**బి.కొత్తకోట, ఆగస్టు 3 ప్రభాతవార్త :**

బి.కొత్తకోట, కర్నాటక బార్డర్ బోయపల్లె వద్ద స్కూటర్ ఢీ కొని కడపజిల్లా మహిళ తీవ్రంగా గాయ పడింది. పోలీసుల వివరాలు మేరకు కడపజిల్లా ఎమ్మిగనూరు మండలం, పెద్దమరవీడుకు చెందిన రాజు, లక్ష్మి బ్రతుకు తెరువుకై కర్నాటక గౌనిపల్లెకు వచ్చి స్థిరపడ్డారు. కూలిపనుల కోసం బి.కొత్తకోట బోయ పల్లెకి లక్ష్మి వెళ్ళింది. సాయంత్ర ఇంటికి వచ్చేందుకు రోడ్డుపక్కన నిలబడి ఉండగా బైక్ ఢీ కొని తీవ్రంగా గాయపడడంతో ఆసుపత్రిలో చికిత్సల నిమిత్తం చేర్పించారు.

## తంబళ్లపల్లె ఐటీఐ విద్యార్థులకు శ్రీజ బంపర్ ఆఫర్

**తంబళ్లపల్లె, ఆగస్టు 3, ప్రభాతవార్త:**

తంబళ్లపల్లె మండల కేంద్రం సమీపంలో టీఎన్ వెంకట సుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటీఐకి చెందిన విద్యార్థులకు తిరుపతి శ్రీజ కంపెనీ యాజమాన్యం బంపర్ ఆఫర్ ఇచ్చినట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎం.నాగరాజు తెలిపారు. శనివారం ఐటీఐలో శ్రీజ కంపెనీ యాజమాన్యం జాబ్ మేళా నిర్వహించారు. ఇందులో 50 మంది ఎలక్ట్రీషియన్, పిట్టర్ విద్యార్థులు పాల్గొని జయప్రదం చేశారు. ఈ జాబ్ మేళాలో ఎంపికైతే విద్యార్థులకు కంపెనీ ప్రతినిధులు విత్ అలవెన్స్‌తో రూ.25వేలు జీతంతో నియామక పత్రాలు అందిస్తామన్నారు. ఇంకా టీఏ, డీఏ, అలవెన్సులు, పీఎఫ్ తదితర సదుపాయాలు కల్పిస్తారన్నారు. జాబ్ మేళాలో 50 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో 25 మంది ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఇన్ ఛార్జి ప్రిన్సిపల్ నాగరాజు మాట్లాడుతూ శ్రీజ కంపెనీకి ఎంపికైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకోవాలని భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరి ఆర్థికంగా స్థిరపడాలని సూచించారు. ఈ జాబ్ మేళాలో శ్రీజ కంపెనీ ప్రతినిధులు, ఐటీఐ అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించుకుందాం

కడప వైద్య విభాగం, ఆగస్టు 3, ప్రభాతవార్త:




డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించుకోవడంలో విద్యార్థి యువత భాగస్వామ్యం కావాలని తెదేపా అనుబంధ విద్యార్థి విభాగం టీఎన్ఎస్ఎఫ్ చైతన్యం చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే మాధవిరెడ్డి కొనియాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజం అభివృద్ధిలో భాగస్వాములు కావాల్సిన యువత నేడు మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారడం బాధాకరమన్నారు. చాపకింద నీరులా వ్యాపిస్తున్న డ్రగ్స్‌ను ఎంవరికి వారు నిర్బంధించుకోవాలన్నారు. సరదాగా మొదలయ్యే ఈ అలవాటు చివరికి బానిసరగా మార్చుకుంటుందని అసాంఘిక, అరాచక, హింసాత్మక నేరాలు చేసేందుకు కూడా వెనకాడరన్నారు. కావునా సత్ప్రవర్తనతో క్రమశిక్షణతో ఇలాంటి వాటి జోలికి పోకుండా ఉండాలని హితవు పలికారు. అనంతరం పోస్టరును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జా తరుమలేష్, ఉపాధ్యక్షుడు ఏటూరి లోకేష్, చేతన్‌కుమార్‌రెడ్డి, రాజేష్, శివ, ఫరీద్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# నిత్యవసర సరుకుల గోదామును ఆర్డిఓ తనఖీ

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 3, ప్రభాతవార్త:



నిత్యవసర సరుకుల గోదామును రాయచోటి ఆర్డిఓ రంగస్వామి శనివారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గోదాముల్లో సరలను పరిశీలించారు. ఎన్ని బస్తాలు బియ్యం, పంచదార ఉన్నాయని గోదాము టిడి మల్లికార్జునబాబును అడిగి తెలుసుకున్నారు. గోదాములోని స్టాకు పరిశీలించారు. ఈ సందర్భంగా డీలర్లకు సరుకులు పంపిణీ చేసేముందు తుకాలు వేసి ఇవ్వాలని అలాగే వచ్చిన స్టాకున్న తూకం వెయ్యకుండా సరుకులు ఎత్తకుదదన్నారు. సకాలంలో నిత్యవసర సరుకులు డీలర్ల అందించాలని 1వ తేదీ నుంచి లబ్దిదారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసేట్లు చూడాలన్నారు. ఎక్కడ కూడా అక్రమాలు జరకుండా నిత్యవసర సరుకులు లబ్దిదారునికి అందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఫోర్స్మెంట్ డిటి హుస్సేన్సాబ్ డిటిలు రెడ్డన్న. రాజేంద్రరావు, ఆర్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీసాయి ఇంజినీరింగ్ కళాశాలలో

# పచ్చదనం - పరిశుభ్రత కార్యక్రమం




రాయచోటి, ఆగస్టు 3, ప్రభాతవార్త:

అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం మొదటి సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థుల ఇండక్షన్ తరగతుల నిర్వహణలో భాగంగా పచ్చదనం-పరిశుభ్రం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల హ్యూమానిటీస్ అండ్ సైన్స్ విభాగాధిపతి డా.ఎన్. నాగేంద్ర, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ అధికారి కరుణాకర్ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో మొక్కలను నాటి చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా శ్రీ సాయి విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డా.ఎం.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ చెట్లు పర్యావరణాన్ని కాపాడి కాలుష్యాన్ని తగ్గిస్తాయని తద్వారా ప్రజల ఆరోగ్యం మరియు జీవిత కాలం మెరుగవుతాయని అభిప్రాయపడ్డారు. చెట్లు మానవాళికి రక్ష అని చెట్లను పెంచడం వల్ల జీవ వైవిధ్యంను పెంపొందించవచ్చని కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి కరుణాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను డా.ఎం.సుధాకర్‌రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా.వి.బాలాజీ, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# లక్ష్మినరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు




బద్వేలు, ఆగస్టు 3 ప్రభాతవార్త :

ఆషాడమాసం చివరి శనివారాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన స్వయంభు లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకం మరియు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామివారితో పాటు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు మాట్లాడుతూ ఇక్కడ స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న తమకు అన్ని సమస్యలు తీరినట్లు ఉంటుదని, అలాగే తమ కోరికలు నెరవేరుతుంటాయని తెలియజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి వల్లెరవారిపల్ల గ్రామంలో నివసించే రామసుబ్బారెడ్డి, ఆయన ధర్మపత్ని రమణమ్మలు సహకరించారు.

# క్రీడా విద్యార్థుల అభినందన సభ

బద్వేలు అర్బన్, ఆగస్టు 3 ప్రభాతవార్త :

పట్టణంలోని రెడ్డి సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం క్రీడలలో విజయం సాధించిన విద్యార్థులను అభినందించారు. బద్వేలుకు చెందిన గంగసాని సౌమ్యారెడ్డి అంతర్జాతీయ స్థాయిలో జపాన్ దేశంలో నిర్వహించిన జంప్‌రోప్ ఆటలో తొమ్మిదవ స్థానం, అలాగే రాష్ట్రస్థాయి జంప్‌రోప్‌లో గోల్డ్‌మెడల్ సాధించిన గంగసాని నందగోపాల్‌రెడ్డిలను అభినందిస్తూ రెడ్డి సేవాసంఘం కార్యాలయంలో సత్కరించారు. అనంతరం వారినుద్దేశించి గంగసాని సాంబశివారెడ్డి మాట్లాడుతూ క్రీడలతో పాటు చదువులోను రాణించి ఉన్నత స్థాయిలో స్థిరపడాలని ఆశాభావం వ్యక్తంచేశారు. అలాగే విద్యార్థుల ప్రతిభ పాటవాలను క్రీడలలో ప్రదర్శించి ప్రతిభను మెరుగు పరుచుకుని ఒలంపిక్స్ స్థాయికి ఎదిగి మనదేశానికి మంచి పేరు తేవాలన్నారు. అనంతరం సౌమ్యారెడ్డి, నందగోపాల్‌రెడ్డిలు మాట్లాడుతూ మేము ఈ క్రీడల వల్ల మా తల్లిదండ్రులకు సంతోషాన్ని కలిగిస్తూ చదివిన పాఠశాల, మా ప్రాంతానికి మంచి పేరుతెచ్చేందుకు తమవంతు కృషిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సేవా సంఘం గౌరవాధ్యక్షులు కేవి.సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి గంగసాని వేణుగోపాల్‌రెడ్డి, భూమిరెడ్డి నారాయణరెడ్డి, పెద్ద పోలిరెడ్డి, మద్దల రఘురామిరెడ్డి, బైసాని శివశంకర్‌రెడ్డి, గోనుగుంట వెంకట సుబ్బారెడ్డి, కత్తెరపల్లె శ్రీనివాసులరెడ్డి, నేలటూరు సుబ్బారెడ్డి, చవ్వా వెంకట్రామిరెడ్డి, గంగసాని జయసుబ్బారెడ్డి, ఆదూరు వీరప్రతాపరెడ్డి, అరవ రమేష్‌రెడ్డి, జమ్మన శేఖర్‌రెడ్డి, గంగసాని రామసుబ్బారెడ్డి, బుట్టి చిదానందరెడ్డి, అనుకోలు వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# బిడ్డకు తల్లిపాలు అమృతంలా పనిచేస్తాయి

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 03, ప్రభాతవార్త:



పుట్టిన అరగంటలోపే తల్లిపాలు తాగించడం వల్ల శిశువుకు అనేక ప్రయోజనాలు ఉంటాయని దేవలంపల్లి పిహెచ్సి ప్రధాన వైద్యురాలు నజియా మెహతా పేర్కొన్నారు శనివారం పంచాయతీలోని రెడ్డివారిపల్లె హరిజనవాడ చింతకుంట మండల పల్లి అవగాహన కల్పించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ తల్లి ముర్రపాల వలన వ్యాధి నిరోధక శక్తి పెరుగుదల, మెదడు ఎదుగుదలతో పాటు పిలల్లు చురుగ్గా ఉండేలా చేస్తాయి. కానీ పాశ్చాత్య సంస్కృతితో భాగంగా కొందరు సౌందర్యం తగ్గుతుందని మరికొందరు ఉద్యోగరీత్యా తల్లులు బిడ్డలకు పాలివ్వడం లేదు. పుట్టిన నెల రోజులకే పోతపాలు పట్టిస్తున్నారు. ఇది మంచిది కాదన్నారు నేటికి కొందరు మూఢ నమ్మకాలతో పుట్టిన రెండు, మూడు రోజుల వరకూ తల్లిపాలను ఇవ్వడం లేదు. ఇలాంటి చర్యలతో బిడ్డలతో సహ తాము నష్టపోతున్నామనే విషయాన్ని తల్లులు గ్రహించలేకపోతూన్నారన్నారు. ఈ నేపథ్యంలో తల్లిపాలలో ఉండే పోషకాలు, బిడ్డ ఎదుగుదల చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ శివకుమార్, ఏఎన్ఎం పుష్పలత అంగన్వాడి కార్యకర్తలు, అంగన్వాడి హెల్పర్ పిల్లల తల్లులు పాల్గొన్నారు.

# ఎర్రచందనం తరలిస్తే కఠిన చర్యలు

డిఎస్పి.టి.వెంకటేశులు

మైదుకూరు ఆగష్టు 3, ప్రభాతవార్త :



ఎర్రచందనం చెట్లను నరకడం, దుంగలను అక్రమంగా తరలించడం చట్టరీత్యానేరమని, తరలించిన వారి పైన కఠినచర్యలు తీసుకుంటామని డీఎస్పీ.టి. వెంకటేశులు హెచ్చరించారు. శనివారం మైదుకూరు సబ్‌డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్టేషన్‌లలో గతంలో ఎర్రచందనం కేసులలో నిందితులుగా ఉన్న 163మందికి డీఎస్పీ శనివారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంధర్బంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎర్రచందనం తరలించడం నేరమని, గతంలో కేసులలో ఉన్నవారు తిరిగి అలాంటి కార్యకలాపాలకు పాల్పడవద్దన్నారు. ఎర్రచందనం తరలిస్తే పట్టు పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎర్రచందనం స్మగ్లర్లకు సహాయం చేయడం కూడా నేరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు పట్టణ ఇన్స్పెక్టర్ ఏపి.మస్తాన్, డివిజన్‌పరిధిలోని సబ్ ఇన్స్పెక్టర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

# చల్లా రాజన్న ఆధ్వర్యంలో కొనసాగుతున్న అన్నదానం

ప్రొద్దుటూరు, ఆగస్టు 03, ప్రభాతవార్త:

ప్రొద్దుటూరు పట్టణంలో గత మూడేళ్లుగా టిడిపి బిసి నాయకులు, శ్రీ కృష్ణాలయ యాదవ సేవ కమిటి అధ్యక్షులు చల్లా రాజగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రతి శనివారం మరియు పౌర్ణమి రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా శనివారం స్థానిక పాత బస్టాండ్ వద్ద ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని చల్లా రాజగోపాల్ యాదవ్ ప్రారంభించారు. ఈ సంధర్భంగా అన్నదాన కార్యక్రమంలో సుమారు 1000మందికి పైగా పాల్గొని తమ సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చల్లా రవిశంకర్ యాదవ్, మూరబోయిన శ్రీనివాస యాదవ్, రాఘవ, వంటమాష్టర్ బంగి శివ, సీతంపల్లి రమణ, ఈశ్వర్ రెడ్డి, టైలర్ ప్రసాద్, రాయల్, జయచంద్ర, ఏసునాథ్ రెడ్డి, రవి, హరీష్ బాబు, నేలటూరు సంజీవ్, టైలర్ గిరి, దస్తగిరి, నల్లం రవిశంకర్ మరియు అన్నప్రసాద కమిటి సభ్యులు పాల్గొన్నారు.

# బ్యాంక్ మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలి

జై భీమ్ భారత్ పార్టీ నేత పల్లె రమేష్ డిమాండ్

ప్రొద్దుటూరు, ఆగస్టు 03, ప్రభాతవార్త:



ప్రొద్దుటూరు పట్టణం టిబి రోడ్డులో గల బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్ మేనేజర్ ముద్ర, ఇతర రుణాలు మంజూరు చేయాలంటే లంచం డిమాండ్ చేస్తున్నారని అందుకే బ్యాంక్ మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని జై భీమ్ భారత్ రాష్ట్ర కార్యదర్శి పల్లె రమేష్ డిమాండ్ చేశారు. శనివారం బ్యాంకు ఎదురుగా లబ్దిదారులతో కలిసి ఆయన నిరసన వ్యక్తం చేశారు. లబ్దిదారులకు అన్ని అర్హతలు ఉన్నప్పటికి ఇవ్వాలంటే ఒక్కో లబ్దిదారున్ని కనీసం 4 నుండి 6నెలలు బ్రాంచ్ చుట్టు తిప్పుకొని మీ యొక్క రుణం నగదు నుండి 10శాతం లంచం ఇస్తేనే రుణం మంజూరు చేస్తానని చెప్పారన్నారు. కావున బ్యాంక్ మేనేజర్‌ను తక్షణమే విధుల నుండి తప్పించి విచారణ జరిపి సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు సిఫారసు చేయాలని లబ్దిదారుడు పి.సురేష్, జై భీమ్ రావ్ భారత్ పార్టీ స్టేట్ జాయింట్ సెక్రటరీ పల్లె రమేష్, రాయలసీమ పర్యవేక్షణ సంఘం రాష్ట్ర కన్వీనర్ ములపాక ప్రతాప్‌రెడ్డి, ఎం.ఆర్.పి.ఎస్ జిల్లా అధ్యక్షులు గడ్డం నరసింహ, తీట్ల రవికుమార్, పుల్లయ్య, శ్రీనివాసులు డిమాండ్ చేశారు.

# కౌలు రైతులు బ్యాంకుల ద్వారా రుణాలు పొంది సద్వినియోగం చేసుకోవాలి

ముద్దనూరు, ఆగస్టు 03, ప్రభాతవార్త:



మండలంలోని కౌలు రైతులకు సంబంధించిన రైతుల జాబితాను ముద్దనూరులో ఉన్న ఆయా బ్యాంకులకు కౌలుదారుల జాబితాను అందజేసి కౌలు రుణాలు అందించాలని ఆయా మేనేజర్లుతో సంప్రదించి మాట్లాడినట్లు మండల వ్యవసాయ అధికారి మారెడ్డి.వెంకట కృష్ణారెడ్డి శనివారం నాడు తెలిపారు. మండలంలో 143మంది రైతులకు కౌలు కార్డులను రెవెన్యూ శాఖవారు అందించినట్లు తెలిపారు. కౌలు రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించి రైతులకు సహకరించి వ్యవసాయ అభివృద్ధికి తోడ్పాటు అందించడమే ప్రభుత్వ ధ్యేయం అని తెలిపారు. కౌలు రైతులకు ఆయా బ్యాంకులను సంప్రదించి రుణాలు పొందాలని తెలిపారు.

# తప్పిపోయిన వ్యక్తి కుటుంబ సభ్యులకు అప్పగింత

-ఎస్సై అబ్దుల్ జహీర్

నందలూరు, ఆగష్టు 3, ప్రభాతవార్త:



నందలూరు మండలంలోని సౌమ్యానాథ స్వామి ఆలయ దర్శనానికి వచ్చిన పెనగలూరు మండలం, నారాయణ నెల్లూరు కు చెందిన తోట హరిబాబు అనే వ్యక్తి ఈదరనల్లి చివర్లలో అతని మోటర్ సైకిల్ ఆచూకీ లభ్యం కావడంతో మండల ఎస్సై అబ్దుల్ జహీర్, తన సిబ్బంది రవితేజ, దిలీప్‌లతో గాలింపు చర్యలు చేపట్టగా ఈదరపల్లి కి సుమారు పది కిలోమీటర్ల దూరంలో తోట హరిబాబు ఆచూకీ లభ్యమైందని ఎస్సై తెలిపారు. హరిబాబును విచారించగా దేనికోసం అడవికి వెళ్లి దారితప్పి యానని చెప్పడంతో అతనిని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి అప్పజెప్పడం జరిగిందని తెలిపారు.

# నారాయణ స్కూల్‌లో ఘనంగా పేరెంట్స్ ట్విన్నింగ్ చైల్డ్ డ్రెస్

కడప వైద్యవిభాగం, ఆగస్టు 3, ప్రభాతవార్త:



కడప బిల్టప్ సర్కిల్ వద్ద ఉన్న నారా యణ విద్యా సంస్థలో పేరెంట్స్ ట్విన్నింగ్ చైల్డ్ డ్రెస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నారాయణ విద్యా సంస్థల ఏజీఎం చెన్నకేశవరాజు మాట్లాడుతూ పిల్లల చదువు గురించి తల్లిదండ్రులతో కొన్ని విషయాలు చర్చించిన తరువాత తల్లి దండ్రులకు మంచి ఆటల కార్యక్రమాన్ని ప్రారంభించారు. హానరబుల్ గెస్ట్ ఆర్ఐ రామకృష్ణా శర్మ మాట్లాడుతూ మీ పిల్లల బాధ్యత మా బాధ్యతగా తీసుకొని పిల్లలకు మంచి భవిష్యత్తు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్కూలు ప్రిన్సిపల్ కల్పన, ఈ కిడ్స్ కోఆర్డినేటర్ భాను, అకడమిక్ డీన్ తాజుద్దీన్, రవికాంత్, ఈకిడ్స్ వైస్ ప్రిన్సిపల్ మరియు ఉపాధ్యాయులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఎఫ్ఎన్‌హెచ్‌డబ్ల్యూ హెల్త్ సబ్ కమిటీ సభ్యులకు శిక్షణ కార్యక్రమం

పెండ్లిమర్రి, ఆగస్టు 3, ప్రభాతవార్త:



మండల సమాఖ్య కార్యాలయంలో శనివారం ఎఫ్ఎన్‌హెచ్‌డబ్ల్యూపైన హెల్త్ సబ్ కమిటీ సభ్యులకు మరియు వీవోఏలకు 3వ రోజు శిక్షణ కార్యక్రమానికి గౌరవ ఎంపీడీవో హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం పోషణ మరియు పరిశుభ్రతపై ఎస్‌హెచ్‌జీ సభ్యులకు మీరు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని అందరికీ అవగాహన కల్పించారు. రక్తహీనత, మంచి నీరుపై ప్రజలకు తెలియజేయాలి, ప్రస్తుతం వస్తున్న సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని తెలిపారు. రీసోర్సు పర్సన్‌లు, డీపీఎంయూ నుంచి మాధవి, ఏపీఎంలు గంగాధర్, వెంకటేశ్వరరావు, పూర్ణిమ, మండల స్టాఫ్, మండల సమాఖ్య లీడర్లు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామన్న ఆర్టిపిపి యాజమాన్యం

కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలంటూ తలపెట్టిన ధర్నా విరమణ

యర్రగుంట్ల, ఆగస్టు 03, ప్రభాతవార్త:



మండల పరిధిలోని డాక్టర్ ఎంవిఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో పనిచేస్తూ ముద్దనూరు గ్రామానికి చెందిన అన్వర్ బాష శుక్రవారం నాడు క్రేన్ ప్రమాదంలో మృతి చెందిన కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఆర్టిపిపి కర్మాగారం ఎదుట కుటుంబ సభ్యులు, యూనియన్ నాయకులు శనివారం నాడు ధర్నా చేపట్టారు. భద్రత అధికారుల నిర్లక్ష్యం వలన ఒకరు చేయవలసిన పనిని అనుభవం లేని కార్మికులతో పనిచేయించడం వలన అక్బర్ బాషాపై క్రేన్ డ్రైవర్ వాహణం తొక్కించడంతో మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మృతుని కుటుంబ సభ్యులు న్యాయం చేయాలంటూ ధర్నా చేపట్టడంతో ఆర్‌టిపిపి ఏపి జెన్‌కో బోర్డు సభ్యుడు సిఈ గౌరిపతి కుటుంబ సభ్యులకు 23లక్షల రూపాయలు డబ్బు మరియూ 129జీవో ప్రకారం కుటుంబంలోని వారికి మెయింటెన్స్‌లో ఉద్యోగం ఇస్తామని హామీ ఇవ్వడంతో కుటుంబ సభ్యులు ధర్నాను విరమించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

# ముర్రు పాలు ఇవ్వడం వలన రోగ నిరోధక శక్తి పెరుగుతుంది

ఖాజీపేట, ఆగస్టు 03, ప్రభాతవార్త:



బాలింతలు, పిల్లలకు ముర్రుపాటు ఇవ్వడం వలన రోగ నిరోధక శక్తి పెరుగుతుంది అని అంగన్వాడి సీడీపీఓ శ్రీదేవి పేర్కొన్నారు. ఆగస్టు 1 నుంచి 7వరకు జరిగే తల్లి పాల వారోత్సవాలలో బాగంగా శనివారం ఖాజీపేట మండలం తవ్వారిపల్లె సచివాలయం పరిధిలోని తవ్వారిపల్లె మిని, తవ్వారిపల్లె 1, తవ్వారిపల్లె అంగన్వాడి కేంద్రాల గర్భవతులను, బాలింతలను గ్రామ ప్రజలందరిని పిలిపించి తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా సిడిపిఓ శ్రీదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ ముర్రుపాల ఆవశ్యకతను వివరించారు. ముర్రుపాటు ఇవ్వడం వలన పిల్లలు వ్యాధినిరోధక శక్తి కలిగి ఉంటారని, తల్లికి రొమ్ము క్యాన్సర్ రాదని తెలియజేశారు. సచివాలయం ఏఎన్ఎం మాట్లాడుతూ తల్లి పాలు ఇవ్వడం వలన బిడ్డకు బిడ్డకు గ్యాప్ వస్తుంది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సిడిపిఓ శ్రీదేవి, సూపర్‌వైజర్ రమాదేవి, సూపర్‌వైజర్ శ్రీదేవి, ఏఎన్ఎం, అంగన్వాడి టీచర్స్ పాల్గొన్నారు.

# నీరు రాకతో ముమ్మరంగా వ్యవసాయ పనులు

దువ్వూరు, ఆగస్టు 03, ప్రభాతవార్త:



జిల్లాకు ప్రధాన నీటి వనరు అయిన కేసీ కాలువకు నీరు రావడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నం అయ్యారు. కుందూనదిలో రాజోలి వద్ద శుక్రవారం మైదుకూరు ఎమ్మెల్యే, కేసీ కాలువ అధికారులు నీరు విడుదల చేశారు. విడుదల చేసిన నీరు శనివారం దువ్వూరు ప్రాంతానికి చేరింది. దీంతో రైతులు వారి నారుమళ్ల వేసేందుకు సిద్ధం అవుతున్నారు. విత్తనపు ధాన్యం కోసం రైతులు వివిధ ప్రాంతాలకు వెలుతున్నారు. సకాలంలో వర్షాలు రాకపోవడంతో నీరు వస్తుందో లేదా అనే సందిగ్ధవస్థలో ఉన్న రైతులకు అనుకోకుండా శ్రీశైలం ప్రాజెక్టుకు నీరు రావడం ప్రాజెక్టుల నుండి పోతిరెడ్డిపాడు ద్వారా కేసీ కాలువకు నీరు వదిలారు. దీంతో కేసి రైతులకు ఊరట లభించింది. రెండు మూడు రోజుల్లో వరినారుమళ్ల వేసేందుకు సిద్ధపడుతున్నారు. విత్తనాల కోరత రైతులను వేధిస్తుందని చెప్పవచ్చు. గతంలో ఏపీ సీడ్ కార్పొరేషన్ ద్వారా రైతులకు వరి విత్తనాలు సబ్సిడీపై అందించేవారు. ఈ ఏడాది మాత్రం అటువంటి ఆలోచన ప్రభుత్వం చేయలేదు. దీంతో వరి విత్తనాల కొరకు రైతులు వివిధ ప్రాంతాలకు వెల్లి తెచ్చుకుంటున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు వరి ధాన్యం విత్తనాలు నాణత్య గలవి లభించే విధంగా చూడవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# తల్లి పాలు బిడ్డకు సురక్ష

-టిడిపి రాష్ట్ర బీసి ఉపాధ్యక్షుడు తాటి సుబ్బరాయుడు

నందలూరు, ఆగష్టు 3, ప్రభాతవార్త:



తల్లి పాలే బిడ్డకు సురక్ష అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బి.సీ ఉపాధ్యక్షుడు తాటి సుబ్బరాయుడు అన్నారు. స్థానిక అంగన్వాడి స్కూల్లో ఏర్పాటు చేసిన తల్లిపాల వారోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా రావడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిపాలు పిల్లలకు ఎంతో బలాన్ని ఇస్తాయని పురిటి పిల్లలకు తల్లిపాలు వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని అన్నారు. నాటి నుండి నేటి వరకు వైద్యులు కానీ పెద్దలు కానీ చెప్పే విషయం ఇదేనని తల్లిపాలు పిల్లలకు ఇవ్వడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందని తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ విజయలక్ష్మి, ఆయా లలిత, సి.హెచ్.ఓ మల్లేశ్వరి, పీ.హెచ్.ఎన్.శైలజ, మరియు అంగన్వాడి సెంటర్ తల్లులు పిల్లలు పాల్గొన్నారు.

# ఏపీ ఎన్జీవో సంఘం మెంబర్షిప్ అందుకున్న కడప జిల్లా ఖజానా అధికారులు

కడప కార్పొరేషన్, ఆగస్టు 3, ప్రభాతవార్త:



ఏపీఎన్జీవో అసోసియేషన్‌లో ఇంత వరకు నాన్ గెజిటెడ్ ఉద్యోగులు మాత్రమే మెంబర్షిప్ ఉండేదని, ఇప్పుడు గజిటెడ్ ఉద్యోగులందరిని అసోసియేషన్‌లో చేర్చుకొని కలిసిపోతున్నట్లు జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు తెలిపారు. జిల్లాలో అందరికీ మెంబర్షిప్ ఇస్తామన్నారు. ఉద్యోగుల డిమాండ్ల సాధన కోసం ముందుండి పోరాటం చేసి డిమాండ్ల సాధనకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు కడప సిటీ ఆధ్వర్యంలో శనివారం కడప జిల్లా ఖజానా అధికారి ఎంఎస్.వెంకటేశ్వర్లు, ఏటీవో, ఎస్టీవోలు రవిశేఖర్, సుందర్‌రావు, శేషాద్రిలకు సంఘం మెంబర్షిప్ ఇచ్చారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె.వి.శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి సీహెచ్ పురుషోత్తం నాయుడుల పిలుపు మేరకు గజిటెడ్ ఉద్యోగులను సంఘంలో చేర్చుకుంటామని శ్రీనివాసులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి డి.రవికుమార్, కడప సిటీ అధ్యక్షులు కె.చిన్నయ్య, కార్యదర్శి సైలేశ్వర్‌రెడ్డి, నాగార్జున, నాగిరెడ్డి, పద్మనాభం, వెంకట రామరాజు పాల్గొన్నారు.

# ప్రొద్దుటూరు త్రీ టౌన్ సీఐగా గోవిందరెడ్డి

ప్రొద్దుటూరు క్రైం, ఆగస్టు 3, ప్రభాతవార్త:

ప్రొద్దుటూరు త్రీ టౌన్ సీఐగా గోవిందరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. అలాగే టుటౌన్ సీఐగా యుగందర్, వన్‌టౌన్ సీఐగా రామకృష్ణలు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారికి తమ సిబ్బంది స్వాగతం పలికారు.

# 2వ వార్డు స్కూల్లో ఐ స్క్రీనింగ్ ప్రోగ్రాం



ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 03, ప్రభాతవార్త:

పట్టణంలోని బుడ్డాయపల్లెలోని రెండవ వార్డులోని మున్సిపల్ హైస్కూల్‌లో స్కూల్ ఐ స్క్రీనింగ్ ప్రోగ్రాంను నేత్ర వైద్య అధికారి కేజే రఘురామ్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ పిల్లలు అందరికి కంటి పరీక్షలు నిర్వహించారు. 394 మందికి గాను 33మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించారు. వీరందరికి కేంద్ర అంధత్వ నివారణ సంఘం ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంఘం ద్వారా ఉచితముగా కళ్ల అద్దాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కంటి సంబంధిత వ్యాధులకు మందులు ఉచితంగా ఇస్తామని, అలాగే పుట్టుకతో ఎవరికి అయినా శుక్లాలు ఉన్నట్లు అయితే ఉచిత శస్త్ర చికిత్సలు కూడ కడప రిమ్స్‌లో చేస్తారని తెలిపారు. కళ్ల అద్దాలు వచ్చిన తరువాత ప్రతి ఒక్కరూ రాత్రి పూట తప్ప మిగతా టైమ్‌లో కంటిన్యూగా అద్దాలు వాడినట్లు అయితే నెంబర్ పెరగకుండా కంటి చూపు కోల్పోకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. విటమిన్ ఏ ఎక్కువగా ఉండే బొప్పాయి, మామిడిపండ్లు, చేపలు అన్ని రకాల ఆకుకూరలు తినాలన్నారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు గంగాభవాని, పుష్పకుమారి, రమణమ్మ, హెడ్ మాష్టర్ గీత, క్రాఫ్ట్ టీచర్ పద్మలు పాల్గొన్నారు.